VICTORY

విక్టరీ

# సత్యహరిశ్చంద్ర



# సత్యహరిశ్చంద్రీయము

✍

డా॥ జి.వి.పూర్ణచంద్

వెల : 30/-

# సత్యహరిశ్చంద్రీయము

రాముడూ, కృష్ణుడూ, ఆంజనేయుడు తర్వాత తెలుగువారికి బాగా తెలిసిన ప్రసిద్ధ పాత్ర హరిశ్చంద్రుడే ! సత్యవ్రతాన్ని దీక్షగా పాటించిన హరిశ్చంద్రుడంటే తెలుగువారికి చాలా ఇష్టం. అందుకు ప్రధాన కారకుడు బలిజేపల్లి లక్ష్మీకాంత కవి !

ఋగ్వేదంలో ఒక హరిశ్చంద్రుడున్నాడు ! చంద్రమతి, విశ్వామిత్రుడు, లోహితాశ్యుడు ఇలాంటి పాత్రలన్నీ ఈ వేదహరిశ్చంద్రుడి కథలోనూ వున్నాయి. కానీ, అతను అబద్ధాలకోరు. ఒకే అబద్ధాన్ని పదే పదే ఆడి, హరిశ్చంద్రుడంటే 'అబద్ధాలపుట్ట' అనిపించుకున్నాడు.

కానీ, కావ్యహరిశ్చంద్ర, వేదహరిశ్చంద్ర కన్నా భిన్నమైన పాత్ర. ఆడినమాటకోసం రాజ్యం అర్పించాడు. తన సమస్త భోగాలూ అర్పించాడు. ఆఖరికి తన ప్రాణాలు ధారపోయడానికి సిద్ధపడ్డాడు.

ఈ హరిశ్చంద్ర పాత్రని బలిజేపల్లి లక్ష్మీకాంత కవి ఉప్పుసత్యాగ్రహం సమయంలో, 1930లో జైల్లో వున్న కాలంలో రచించారు. హరిశ్చంద్రుడు తెలుగువాడేనన్నంతగా తెలుగు ప్రజలు ఈ నాటకాన్ని ఆదరించారు.

బలిజేపల్లి లక్ష్మీకాంత కవి బాపట్ల దగ్గర ఇటికలపాడు గ్రామంలో పుట్టారు. తల్లి ఆదిలక్ష్మమ్మ. తండ్రి నరసింహశాస్త్రి. మేనమామ భాగవతుల చిన్నకృష్ణయ్య గారి ఇంట్లో వుండి చదువుకున్నారు.

కర్నూలు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో హెడ్‌గుమాస్తాగా కొన్నాళ్ళు పనిచేశారు. గుంటూరు హిందూ కాలేజీలో ప్రధానోపాధ్యాయుడిగా కూడా పనిచేశారు.

లక్ష్మీకాంత కవి తన సహజ పాండిత్య వైభవంతో ఎన్నో అవధానాలు నిర్వహించారు కూడా. తెలుగు సంస్కృత భాషల్లో అనర్గళంగా కవిత్వం చెప్పగలిగేవాడాయన !

1923లో గుంటూరులో చంద్రిక ప్రింటింగ్ ప్రెస్‌ని నెలకొల్పారు. 1926లో 'ఫస్ట్ కంపెనీ' పేరుతో నాటక సమాజాన్ని స్థాపించి హరిశ్చంద్ర నాటకాన్ని దేశం నలుమూలలా ప్రదర్శించారు.

శివానందలహరి శతకం, స్వరాజ్య సమస్య అనే పద్యకావ్యం, బ్రహ్మరథం, మణిమంజూష నవలలు, బుద్ధిమతి విలాసం, సత్యహరిశ్చంద్రీయం, ఉత్తర రాఘవీయం నాటకాలు రచించారు.

రామాయణం సుందరకాండ వ్రాస్తూ ముగించకుండానే మరణించారు.

హరిశ్చంద్ర నాటకానికి లక్ష్మీకాంత కవి పెట్టిన పేరు "సత్య హరిశ్చంద్రీయం" అని ! ఇందులో దాదాపు 25 పాత్రలున్నాయి. నలుగురైదుగురు స్త్రీలు కూడా నటించవలసి వుంది. భటులు, వంది మాగధులు, సూత్రధారుడు తదితరులతో కలిపి కనీసం 35 మంది నటులు ప్రదర్శించవలసిన నాటకం ఇది.

పౌరాణిక నాటకాలకు పద్యం ప్రాణం. ఈనాటి పాఠకులు పద్యాన్ని సమర్థవంతంగా పాడి విన్పిస్తే విని ఆనందిస్తారు గానీ, చదివే ఓపిక వారికి తక్కువ. పైగా 'భాష' కూడా కొంత గ్రాంథికంలో వుండడాన నేరుగా సత్యహరిశ్చంద్రీయం నాటకాన్ని చదవడం కష్టమైన విషయమే! అందుకే సరళమైన భాషలో ఈ నాటకంలోని ముఖ్యమైన విశేషాల్ని ఈ గ్రంథంలో సంగ్రహంగా అందిస్తున్నాను. అందుకోండి ! ఆస్వాదించండి !!

# 1

# దేవతల సభ

దేవేంద్రుడు కొలువుతీరి వున్నాడు. వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, నారదుడు తదితర మహర్షులు, బృహస్పతి... అంతా ఆశీనులయ్యారు.

వశిష్ఠుడు "క్రతువుల్పెక్కు లొనర్చినన్ నిరతమున్" అంటూ సత్యవాక్పాలన గురించి ఉపన్యసించడం మొదలుపెట్టాడు. యజ్ఞయాగాలు ఎన్ని చేసినా, గంగ మొదలైన నదులు ఎన్నింటిలో మునిగినా, వందలాది ఆవుల్ని, బ్రాహ్మణులు ఎంత మందికి దానం చేసినా, ఓ దేవేంద్రా.... నిత్యసత్యవ్రతుడైన వ్యక్తికి వచ్చే కీర్తి మామూలు వ్యక్తులకు రాదుగాక రాదు – అని ! అబద్ధం ఆడకుండా వుండటం అనేది ఆచరణలో చాలా కష్టం అనీ, మొదట కష్టపడినా, చివరికి ఆ సత్యమే అతన్ని ఉద్ధరిస్తుందనీ ఉపన్యసిస్తున్నాడు వశిష్ఠుడు.

పక్కనే కూర్చున విశ్వామిత్రుడికి చిర్రెత్తుకొస్తోంది ! స్వర్గానికి వచ్చినా ఒడియేకులు తప్పనట్లు, ఇక్కడకూడా ఈ వశిష్ఠుడు దాపురించాడు ... ఇవ్వాళ ఏదో ఒక ఉపాయం ఆలోచించి, వశిష్ఠుడి నోరు మూయించాలి – అనుకొంటున్నాడు.

నారదుడు ఇది గమనించాడు. సభలో వశిష్ఠుడి సుదీర్ఘ ప్రసంగం, విశ్వామిత్రుడి చిరాకు పరాకులు చూసి ... "ఇక్కడ ఇప్పుడు చక్కని కలహం లభించవచ్చును" అనుకొన్నాడు ఆశగా!

"విశ్వామిత్రా ! ఈ వశిష్ఠుడి ఉపన్యాసం మీకేమీ రుచించినట్టులేదే ..." అని నెమ్మదిగా విశ్వామిత్రుడికి ఓ చురక అంటించాడు.

విశ్వామిత్రుడు ఒళ్ళుమంట మీద వున్నాడు కదా... "నిరర్థకమైన అతని ఉపన్యాసానికి మీరంతా సంతోషించారు కదా... చాల్లే !" అన్నాడు.

వశిష్ఠుడికి ఈ మాట తగలరానిచోట తగిలింది – "నా ఉపన్యాసం నిరర్థకం అంటావా' '... అంటూ నేరుగా విశ్వామిత్రుడితో గొడవపడడం మొదలుపెట్టాడు. అప్పుడు విశ్వామిత్రుడు చెప్పాడు –



*"వారి జాక్షలందు వైవాహికములందు*
*బ్రాణ విత్త మానభంగమందు*
*జకితగోకులాగ్ర జన్మరక్షణమందు*
*బొంకవచ్చు నఘము వొందదధిప"*

అని శుక్రాచార్యుడు ఎప్పుడెప్పుడు అబద్ధం ఆడితే తప్పుకాదని చెప్పాడో వాటిని ఏకరువు పెట్టి, సత్యాన్ని విడువని వాడు ఒక్కడు కూడా వుండడని తేల్చాడు. దానికి దేవేంద్రుడు అంగీకరించలేదు. "ఆపత్కాలంలో చలించనివాడే ధైర్యవంతుడు –" అన్నాడు. అలాంటి

వాణ్ణి చూపించమని విశ్వామిత్రుడు రెట్టించాడు. అప్పుడు వశిష్ఠుడు అయోధ్యానగరాన్ని చాతుర్వర్ణ పద్ధతిలో పాలిస్తున్న హరిశ్చంద్రుడి గురించి చెప్పాడు. చాతుర్వర్గ పద్ధతిలో మాలలు, మాదిగలు వంటి కులాల వారిని హీనంగా చూడడం జరుగుతుంది. హరిశ్చంద్రుడు మాలవారి అమ్మాయిల్ని పెళ్ళాడడానికి అంగీకరించక, మాదిగ వానికి బానిసగా అమ్ముడుపోవడం ఈనాటకం ప్రత్యేకత! మనం అదే చూడబోతున్నాం.

వశిష్ఠుడు ఒకవైపు సత్యం, ధర్మం, అహింసలే పరమ ధర్మాలుగా ప్రజలు నడుచుకోవాలని ప్రజల్ని శాసించి, విఖ్యాత శ్రీధరనేలేవాడు, అనాధరక్షకుడు, దయామయుడు... ఈ హరిశ్చంద్రుడు అంటూ వర్ణించసాగాడు.

హరిశ్చంద్రుడు, హరిశ్చంద్రుడు, హరిశ్చంద్రుడు అంటూ మూడుసార్లు ఆయన పేరు ఉచ్చరించాడు.

హరిశ్చంద్రుడి సత్యవ్రతం విషయంలో విశ్వామిత్రుడికి, వశిష్ఠుడికి మాటామాటా పెరిగింది. దేవేంద్రుడి సభలోనే నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. మధ్యలో అటు కాసేపు, ఇటు కాసేపు నారదుడు ఆ ఇద్దర్నీ ఎగదోస్తూనే వున్నాడు.

చివరికి విశ్వామిత్రుడు అన్నాడు – "అతనిచేత కావలసినన్ని బొంకులాడిస్తాను – ఏదీ పందెం ఏం వేస్తావో చెప్పు –" అని !

వశిష్ఠుడు అందుకు ధీటుగానే సమాధానం చెప్పాడు –

ప్రళయ నిర్ఘాతాన్ని అరిచేత పుచ్చుకోవచ్చు. మంచు పర్వతాన్ని కొనవేటితో అమాంతం ఎత్తవచ్చు. భూమినీ, ఆకాశాన్ని ఏకం చెయ్యవచ్చు. కానీ, హరిశ్చంద్రుడిచేత అబద్ధం ఆడించడం ఎవరితరమూ కాదు ...

విశ్వామిత్రా ... నీ కర్మం నువ్వు అనుభవించక తప్పదు – సభ్యులారా ! ఈ ధూర్తుడు హరిశ్చంద్రుడిచేత అబద్ధం ఆడిస్తానని పంతం ఆడుతూ నన్ను పందెం కాయమని రెచ్చగొడ్తున్నాడు. సరే... నా పందెం వినండీ –

హరిశ్చంద్రుడేగనక అబద్ధం ఆడినట్లు ఋజువైతే, నేను గుండు కొట్టించుకొని, నా తపశ్శక్తినంతా వదులుకొంటాను. సాటి రుషులంతా 'ఛీ' అనేట్లు గాడిద ఎక్కి ఊరేగుతాను" అని నిష్కర్షగా ప్రకటించాడు.

దేవతలంతా బాపురే... బాపురే ... అన్నారు.

విశ్వామిత్రుడికి చాలా చిరాకేసింది.

ఒక క్షత్రియాధముడిచేత అబద్ధం ఆడించడానికి ఇంత రాద్ధాంతం చేయాలా? సరే... నా ప్రతిజ్ఞ కూడా వినండి – హరిశ్చంద్రుడిచేత అబద్ధం ఆడించకపోతే, హిమాలయాల్లో వాయుభక్షణం చేస్తూ మృత్యుంజయుణ్ణి మెప్పించి సంపాదించుకున్న నా తపఃఫలాన్ని ధారపోసి, స్వర్గంలో ఈ దేవేంద్రుడి సింహాసనం మీద కూర్చోబెడతాను – దీన్ని తప్పానంటే, ఆ పరమేశ్వరుడి పాదాల్ని తప్పినట్టే – అని ఒట్టువేసి చెప్పాడు.

చివరికి దేవేంద్రుడు, గౌతముడు, బృహస్పతితో సహా అందరినీ తిట్టిపోశాడు విశ్వామిత్రుడు. వాళ్ళు ఆయన్ని ఏమీ చెయ్యలేక, గయ్యాళి పెళ్ళాన్ని వదిలేసినట్లు విశ్వామిత్రుణ్ణి వదిలి వెళ్ళిపోయారు.

వెళ్ళిపోతున్న వశిష్ఠుణ్ణి ఆపి, “ఆడిన పందెము తప్పిపోవు గదా ?” అన్నాడు విశ్వామిత్రుడు. “సూర్యచంద్రులు గతులు తప్పినను తప్పను –” అన్నాడు వశిష్ఠుడు.

2

## విశ్వామిత్రుడు ఆలోచనలో పడ్డాడు

ఎవరీ హరిశ్చంద్రుడు... నిజంగానే అబద్ధం ఆడడా... ఈ పందెంలో నేను గెలుస్తానా ...? ఓడిపోతానా... ?? ఒకవేళ హరిశ్చంద్రుడు నా మాయాజాలంలో పడకుండా, అబద్ధం ఆడకుండా వుంటే ఏమౌతుంది... ? తన పరువు గంగలో కలుస్తుంది...

తను గెలిచాడా వశిష్ఠుడి పీడ అక్కడితోనే విరగడౌతుంది. గుండు కొట్టించుకొని ఊరేగుతాడు. కానీ, తాను ఓడిపోయాడా... వచ్చేకష్టమేమీ లేదు – సాటి రాచబిడ్డ యొక్క సత్యకీర్తిని చిరస్థాయిగా నిలిపిన వాణ్ణౌతాను ...

అయినా... విశ్వామిత్రుణ్ణయిన నాకు అపజయం ఏమిటీ –”

అనుకోసాగాడు. అతని అతిశయమే అనేక పనులు చేయించింది ఈ నాటకంలో...

H H H

రాజసూయ యాగం పూర్తిచేసుకొని హరిశ్చంద్రుడు, అతని మంత్రి సత్యకీర్తితో కలిసి సంతోషంగా తన అంతఃపురానికి తిరిగివచ్చాడు.



రాజసూయం చక్కగా నెరవేరింది గానీ, పూజ్యుడైన విశ్వామిత్రుడు రాలేదని బాధపడ్డాడు హరిశ్చంద్రుడు. ఆయన అలా అనుకొంటూ వుండగానే విశ్వామిత్రుడు వచ్చాడని వార్తాహరుడు వచ్చి చెప్పాడు.

స్వాగతం చెప్పి సగౌరవంగా లోపలికి తీసుకువచ్చాడు ఆయన్ని హరిశ్చంద్రుడు.

హరిశ్చంద్రుడి సపర్యలకు నిజంగానే మనసులో సంతోషించాడు విశ్వామిత్రుడు. అయినా తను వచ్చిన పని వేరు కదా... హరిశ్చంద్రుడిచేత ఆబద్ధం ఆడించాలి... అదీ సంగతి !

హరిశ్చంద్రుణ్ణి చూస్తూనే "ఆహా! ఈ పురుష సింహుని తేజోమూర్తి రమణీయము కదా..." అనుకొంటాడు. అతన్ని చూడగానే అబద్ధం ఆడతాడని మనసులో నమ్మకం కలుగలేదు. కఠినంగా ప్రవర్తించి అయినాసరే బలవంతంగా అబద్ధం ఆడించాలి – తప్పదు – అనుకున్నాడు. హరిశ్చంద్రుడి ప్రవర్తన చూస్తుంటే వశిష్ఠుడు జరిగిందంతా ఈపాటికే చెప్పేసి వుంటాడనే అనుమానం కలిగింది విశ్వామిత్రుడికి. అందుకే కఠినాతి కఠినంగా ప్రవర్తించాలనుకున్నాడు.

హరిశ్చంద్రా ! నీవలన నాకు కొంత ధనం కావలసి వచ్చిందోయ్" అన్నాడు.

విశ్వామిత్రుడంటే ఋషుల్లో అగ్రగణ్యుడు. ఋషిననిపించుకోవడం కోసం అపారమైన రాజ్యవైభవాన్ని గడ్డిపరకలాగా వదిలేశాడు. అలాంటి త్యాగమూర్తికి 'డబ్బు అవసరం' అనేసరికి ఆశ్చర్యం అనిపించింది హరిశ్చంద్రుడికి.

పరమేశ్వర ప్రీతిగా ఒక యాగం చెయ్యడానికి డబ్బు కావాల్సివుందని చెప్పాడు విశ్వామిత్రుడు.

బలవంతుడైన వ్యక్తి ఏనుగుమీద ఎక్కి ఒక రత్నాన్ని పైకి గాల్లోకి విసిరేస్తే ఎంత ఎత్తు పోతుందో, అంతపొడవు ధనం ఇస్తే సరిపోతుందని అడిగాడు విశ్వామిత్రుడు. అంటే కనీసం 50 అడుగుల ఎత్తున ధనరాసి కావాలని అడిగాడన్నమాట.

"డబ్బు ఇప్పుడే వేదండాల మీద కట్టి మీ వెంట పంపించనా?" అన్నాడు హరిశ్చంద్రుడు.

"వద్దులే నీ దగ్గరే వుంచు – నీ ధనంతోపాటు నువ్వు నాకిస్తానన్న ఈ ధనాన్ని కూడా నువ్వే కాపాడు –" అన్నాడు విశ్వామిత్రుడు. ఆ విధంగా హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి అప్పుపడ్డట్లయ్యింది. ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి, "నా అప్పు తీర్చు" అని అడిగే అవకాశాన్ని అట్టిపెట్టుకున్నాడు విశ్వామిత్రుడు.

మునివరా ! లోకం అంతా ధనమూలంగానే అనేక కష్టాలపాలౌతుంది. ఇతరుల సంపదలు చేజిక్కించుకోవాలని చూస్తుంటారు చాలామంది. అందుకనే డబ్బు విషయంలో తల్లిని, తండ్రిని, కొడుకుని, కూతుర్నీ, చివరికి ప్రాణమిత్రుణ్ణి కూడా నమ్మకూడదు – కాబట్టి మీ ధనాన్ని వెంటనే తీసుకువెళ్ళిపోండి" అని చెప్పాడు హరిశ్చంద్రుడు. డబ్బు పోతే పోయింది, ఇతని పీడ ఇంక వుండకూడదని హరిశ్చంద్రుడి భావన.

'నీమీద నాకలాంటి అనుమానం లేదులే' – అంటే, "ఎప్పటికి ఎలాంటి బుద్ధి పుడ్తుందో ఎవరికి తెలుసు ?" అన్నాడు హరిశ్చంద్రుడు ! హరిశ్చంద్రుణ్ణి ఎలాగైనా ఇరికించాలి అనేది విశ్వామిత్రుడి లక్ష్యం ! విశ్వామిత్రుడి వలలో చిక్కుకోకూడదనేది హరిశ్చంద్రుడి ప్రయత్నం !

"ఇంత డబ్బు భద్రం చేసుకోవడానికి మాకు కొంపా గోడా... కళ్ళు మూసుకొని తపస్సు చేసుకొనే మునుల దగ్గర డబ్బు ఎలా వుంటుందీ... దొంగలు దోచుకోకుండా పెట్టెలుంటాయా– ? బేడలుంటాయా ...? మా దగ్గర" అన్నాడు కొంచెం కోపంగానే విశ్వామిత్రుడు.

"నిరంకుశమైన మీ తపశ్శక్తియే మీకు సర్వసాధనం కదా..." అని సర్దుకోబోయాడుగానీ, విశ్వామిత్రుడు లేని కోపం నటిస్తూ, రౌద్రంగా –

"నువ్విచ్చే మూడు గవ్వలకోసం మా తపశ్శక్తిని వృథా చేసుకోమంటావా? ఇంతకన్నా డబ్బు ఇవ్వడానికి కుదరదు అని చెప్పు – వెళ్ళిపోతాను –" అన్నాడు. దాంతో ఇంక రెట్టించి ప్రయోజనం లేకపోయింది.

విశ్వామిత్రుడికి దొరికిపోక తప్పలేదు హరిశ్చంద్రుడికి. సరే – అని నమస్కారం పెట్టేశాడు. అక్కడి నుంచి మొదలయ్యాయి హరిశ్చంద్రుడి కష్టాలు !!

విశ్వామిత్రుడు అట్లా వెళ్ళాడో లేదో కంచుకి అనే వార్తాహరుడు కొంపలంటుకునే వార్త మోసుకొచ్చాడు – రాజ్యంలో ప్రజలు ఘొల్లుమంటూ తండోపతండాలుగా వచ్చి ఘోషిస్తున్నారని !

క్రూర జంతువులు అడవుల్లోంచి ఊళ్ళమీద పడి నానా భీభత్సాన్ని సృష్టిస్తున్నాయని చెప్పుకున్నారు ప్రజలు... ఇప్పటికే చాలా నష్టం జరిగిపోయిందని భోరుమన్నారు.

క్రూరజంతువుల్ని వేటాడడం కోసం తక్షణమే బయల్దేరాడు ససైన్యంగా హరిశ్చంద్రుడు.

విశ్వామిత్రుడు పన్నిన మాయలో హరిశ్చంద్రుడు చిక్కుకోవడం ఇలా మొదలయ్యింది !

3

# అడవిలో విశ్వామిత్రుడు - ఆయన శిష్యుడు నక్షత్రకుడు

విశ్వామిత్రుడు నక్షత్రకుడితో అంటున్నాడు – "క్రూరమృగాల్ని సృష్టించి ఊళ్ళమీదకు వదిలి హడలగొట్టించాను. దెబ్బతో జనం హరిశ్చంద్రుడిమీద పడ్డారు. ఇప్పుడు చచ్చినట్టు హరిశ్చంద్రుడు అడవిలోకి వస్తాడు. ఇదంతా నా పన్నుగడ ప్రకారమే జరుగుతోంది... ఇప్పుడు శృంగార రూపురేఖా భుజంగులైన మాతంగ కన్యల్ని సృష్టిస్తున్నాను" !

ఒకవైపు విశ్వామిత్రుడు తన పథకరచనలో తానుండగా, హరిశ్చంద్రుడు పెద్దపులుల వేటలో అడవుల వెంబడిపడి తిరుగుతున్నాడు.

ఒక పెద్దపులి చూస్తుండగానే మాయమైంది. హరిశ్చంద్రుడు రథం దిగి, పులి అడుగులు వెదుక్కొంటూ నడిచి వెళ్తున్నాడు.

వెనకాల ఇంకో రథం మీద హరిశ్చంద్రుడి కొడుకు లోహితాస్యుడు, భార్య చంద్రమతి కూడా వస్తున్నారు.

అంతా కలిసి, ఓ ముని ఆశ్రమం కనిపిస్తే అక్కడకు చేరుకున్నారు.

ఇది ఎవరి ఆశ్రమమెూ... అనుకొంటుండగా లోపల్నించి – ఎవరో అదమాయిస్తున్నారు ... ఒరే జనార్ధనా ! దర్భలు తీసుకురావడానికి వెళ్ళి ఎంతసేపయ్యిందిరా... గురువు గారు విశ్వామిత్రుల వారి చేతిలో ఇవ్వాళ నీకు కీడు మూడిందిలే..." అని కేకలేస్తున్నాడెవరో!

విశ్వామిత్రుడి పేరు విన్పించగానే ఉలిక్కిపడింది చంద్రమతి.



ఈ ఆశ్రమం ప్రశాంతంగా వుందిగాని, ఇక్కడకొస్తే మనసు ప్రశాంతంగా లేదు – కలవరంగా వుంది – అనుకొంది. హరిశ్చంద్రుడు తనక్కూడా అలానే వుందన్నాడు.

వీళ్ళిలా మాట్లాడుకొంటూ వుండగా, ఇద్దరు మాతంగ కన్యలు వచ్చి రాజుగారికి జోహారు చేశారు.

వాళ్ళని కమ్మగా పాడమని చంద్రమతే స్వయంగా కోరింది. వాళ్ళు చక్కటి నాట్యం చేస్తూ పాటలుపాడారు. ముత్యాలహారం బహూకరించాడు హరిశ్చంద్రుడు.

"ఈ ముత్యాలహారం దేనికి – మాకు నీ రసికత్వం కావాలి–" అని నేరుగా అడిగేశారు ఆ కన్యలిద్దరూ –

"ఛీ ! నికృష్ట వనితలారా ! అవతలకి పోండి" అని గదమాయించాడు మంత్రి సత్యకీర్తి. పోనీలే ! ఏదోఒకటి ఇచ్చి పంపించెయ్యమని జాలిపడింది చంద్రమతి.

వీపు బద్దలుకొడ్తానన్నాడు సేనాని భద్రుడు.

"ఓ హరిశ్చంద్రా ! మమ్మిట్లన్యాయముగా గొట్టించెదవుగా ? కానీ ! మా తండ్రిగారగు విశ్వామిత్రునితో జెప్పి నీ యుసురు దీయింపకున్న మమ్మిపేరుం బిలువవలదు–" అని పెద్దగా ఏడ్చుకుంటూ వెళ్ళిపోయారు ఆ ఆడపిల్లలిద్దరూ –

ఇదంతా ఇద్రజాలంలా వుందని ఆశ్చర్యపోయాడు హరిశ్చంద్రుడు. అంతా కలలాగా జరిగిపోతోంది. ఏదో పెద్ద ఉచ్చులో తమకు తెలియకుండానే ఇరుక్కుపోతున్నామని అనుమానం వచ్చింది హరిశ్చంద్రుడికి.

"అశుభాలు వచ్చేప్పుడే బుద్ధులు కూడా వాటికనుకూలంగా వస్తాయి. ఇంట్లోకి దొంగ చొరబడినప్పుడే నిద్రపెద్దమ్మ ఆవహించినట్లు –" అనుకున్నాడాయన !

విశ్వామిత్రుడు ఆశ్రమంలోంచి పెద్దగా రంకెవేస్తూ అరుస్తున్నాడు ...

"ఔరా ! ప్రచండదండాలతో అన్యాయంగా మిమ్మల్ని కొట్టడానికి ఆ భూనాధాధముడు భటుల్ని పంపించాడా ? అంటూ ఆ రాజుని శపించేస్తానని గర్జించడం మొదలుపెట్టాడు.

ఆశ్రమం బైట నిలబడివున్న హరిశ్చంద్రుడి పరివారానికి ఈ కేకలు విన్పిస్తున్నాయి. నిజంగానే భయపడ్డాడు హరిశ్చంద్రుడు.

నడిచొస్తున్న కాలయముడిలా పెద్దగా అరుస్తూ ఆశ్రమంలోంచి బైటకొచ్చాడు విశ్వామిత్రుడు –

"మహాత్మా ! రక్షమాం రక్షమాం..." అంటూ హరిశ్చంద్రుడు భార్యాపుత్రులతో సహా ఆయన పాదాలమీద పడ్డారు.

"ఛీ పాపి ! అంటూ కిరీటం కిందపడేలాగా కాలుతో తన్నాడు విశ్వామిత్రుడు. అడుగుపెట్టి మా ఆశ్రమాన్నే కాక, మా పాదాన్ని కూడా అంటుపరుస్తున్నావు – దుష్టా!" అన్నాడు దురాగ్రహంతో !

"దుర్మదాంధా – వైవస్వత కుల కళంకా ! దుర్వినయశీలా ! అని తిట్టిపోశాడు.

తన అనుమతి లేకుండా తన ఆశ్రమంలో ప్రవేశించినందుకు తప్పుబట్టాడు. అనవసరంగా తన కూతుళ్ళచేత పాడించి, చివరికి నాలుకలు కోస్తానని బయల్దేరావుట గదా – అని నిలదీశాడు. నీ తాతముల్లె వారికి కట్టబెట్టావా... వాళ్ళ మీద నీ దాష్టీకం ఏమిటీ – అని రెట్టించి అడిగాడు. "ఒరే దుర్మతీ ! మున్నెవరూ రాజులు లేరా ? వాళ్ళెవరూ వేటకు రాలేదా ? నీ మృగయా వినోదానికి మా వంటి జడదారుల ఆశ్రమాలే కావాల్సివచ్చాయా ?" అనడిగాడు.

"మునిద్రోహి ! చూడు – మిమ్మల్నందర్నీ ఏం చేస్తానో... పొట్టకూటికోసం నీకు వెట్టిచాకిరి చేసే వశిష్ఠుణ్ణనుకున్నావా ... నీ అంతు చూడకుండా వదిలిపెడతానా ...?' ' అంటూ చిందులు తొక్కాడు. హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడి కాళ్ళావేళ్ళా పడి క్షమించమని వేడుకొన్నాడు –

*మనవిని వినుమా ! మము గనుగొనుమా ...*
*తనయునిపై నిం తటి పగ చనునా ?*
*కనికరమునసా కక యిటుతగునా ?*
*కనలునం బెను సం కట మిడనగునా ?*

అని ప్రాథేయపడ్డాడు. క్షమించే వరకూ పాదాలు విడవనన్నాడు.

విశ్వామిత్రుడు – చాలా నిర్మొహమాటంగా తన కూతుళ్ళు ఇద్దర్నీ హరిశ్చంద్రుడు వివాహం చేసుకొనేట్లయితే, క్షమిస్తానన్నాడు.

'మాతంగ కన్యలు' అంటే మాలవారి పిల్లలని ! మాలపిల్లలు అంటరాని వాళ్ళు కాబట్టే ఛీఛీ అంటూ తరిమేశారు సత్యకీర్తి భద్రుడు వగైరా పరివారం.

"అంటన్ గూడని మాలకన్నియలతో నా మేలుమేల్పెండ్లిపేరంటాలీ రవి వంశ రాజుల యశః ప్రాకట్యమిప్పాటిదా ?" అంటూ భోరుమన్నాడు హరిశ్చంద్రుడు. ఈ అంటరాని వాళ్ళ పిల్లల్ని పెళ్ళిచేసుకొని సూర్యవంశ రాజులకు అపకీర్తి తెచ్చిపెట్టవలసివచ్చిందని !

"రాజ్యాంతే నరకం ధ్రువః" అన్నారు. ఎటుతిరిగి రాజువు కాబట్టి చివరికి నరకానికే నువ్వు పోతావు. ఇప్పుడీ అంటరాని పిల్లల్ని పెళ్ళాడితే నీకు కొత్తగా వచ్చే నరకమేమీ లేదులే" అన్నాడు వ్యంగ్యంగా విశ్వామిత్రుడు.

మాలపిల్లల్ని పెళ్ళాడానని లోకం ఛీ అంటుందని హరిశ్చంద్రుడంటే, విశ్వామిత్రుడి అల్లుడివని నీకు జోహారులిస్తారని ఆశపెట్టాడు విశ్వామిత్రుడు.

ఆయన ఎంత బెదిరించినా మాలవారి పిల్లని పెళ్ళాడటానికి ససేమిరా అన్నాడు హరిశ్చంద్రుడు.

"నా కుల ప్రధాన ధర్మమే నాకు ముఖ్యం. అందుకోసం భాగ్యభోగ సంపదల్ని ఆఖరికి నా రాజ్యాన్నయినా సరే వదిలేస్తాను - అంతేగాని ఈ మాలపిల్లల్ని పెళ్ళాడేది లేనేలేదు" అని తేల్చి చెప్పేశాడు.

నిజంగా హరిశ్చంద్రుడిలో ఇంతటి కులతత్వం వుందని విశ్వామిత్రుడికి అంతవరకూ తెలీదనే అనుకోవాలి. ఓ పాచిక విసిరిచూశాడు. భార్యా పిల్లలతో వచ్చాడు కాబట్టి వాళ్ళముందు పెళ్ళిప్రస్తావన అంగీకరించడనుకున్నాడు. కానీ, ఇంతకులతత్త్వంతో, మాల పిల్లలు కాబట్టి పెళ్ళాడితే కళంకం వస్తుందని హరిశ్చంద్రుడు అనడంతో విశ్వామిత్రుడిక్కూడా ఆశ్చర్యమేవేసింది !

"కావాలంటే నా రాజ్యం తీసుకోండి ఇచ్చేస్తాను. అంతేగాని, ఈ మాలపిల్లల్ని పెళ్ళాడేది లేదు –" అని స్పష్టంగా నొక్కిచెప్పాడు హరిశ్చంద్రుడు.

"హరిశ్చంద్రా ! ఆ మాటమీదే నిలిచి వుండు. మాట తప్పావా ఆ సదాశివుడి పాదాలమీద ఒట్టే ! ఎన్నాళ్ళనుంచో ఇంకోసారి రాజ్యం ఏలాలని నా మనసు ఉవ్విళ్ళూరుతోంది. ఇన్నాళ్ళకి నాకీ అవకాశం వచ్చింది... నీ రాజముద్రిక ఇటివ్వు, ఆడిన మాట తప్పకు –" అన్నాడు అతిక్రూరంగా విశ్వామిత్రుడు.

హరిశ్చంద్రుడు ఎంతో నిబ్బరంగా "అబద్ధం ఆడతాననుకున్నారా?" అన్నాడు. "కాకపోతే, నిస్సారమైన గొడవలు ఈ రాచరిక సౌఖ్యాలు ...! తపస్సు చేసుకునే మీ వంటి మునులకు ఈ రాచరికపు కష్టాలు దేనికని బాధపడుతున్నాను" అన్నాడు.



"అంటే, రాజ్యం ఎగ్గొడతావా? మాట పెదవి దాటడానికి ముందే ఆలోచించుకోవాలయ్యా – ఏదో మాటవరసకన్నాను గాని, రాజ్యం అమాంతం ఇచ్చేస్తానా... అని స్పష్టంగా చెప్పేయ్ - మళ్ళీ నేను నిన్ను ఏమన్నా అడిగితే "ఛీ" అను" – అని రెట్టించాడు విశ్వామిత్రుడు.

చంద్రమతి  మధ్యలో కల్పించుకొని, సంకోచిస్తారు దేనికండి... మనం పోయేటప్పుడు గడ్డిపరక కూడా వెంటరాదు – 'మాట' ముఖ్యంగాని, రాజ్యం ముఖ్యం కాదు – ఇచ్చి పారెయ్యండి –" అని సలహాచెప్పి ప్రోత్సహించింది. ఆ క్షణాన ఆవిడికంత ఆవేశం ఎందుకొచ్చిందో తెలీదు.

విశ్వామిత్రుడు మనసులోనే ఆ పతివ్రతా లలామ సత్యవ్రతాభిమానాన్ని మెచ్చుకున్నాడు. అయినా, కఠినత్వం కావాలని తెచ్చుకున్నదే కదా – దాన్ని అలాగే కొనసాగించాడు.  ఆమె బంగారపు పాత్రలోంచి దానజలం వదులుతుండగా, "బ్రహ్మర్షి సత్తమా! రాజ్యదానం పరిగ్రహించు–" అంటూ కిరీటాన్ని తన తల మీంచి తీసి విశ్వామిత్రుడి చేతుల్లో పెట్టాడు – హరిశ్చంద్రుడు. "రాజర్షి తిలకా ! రాజలాంఛనంబగు కిరీటంబు ధరియించి యీ ధారుణీచక్రము నిర్వక్రముగా పరిపాలింపుము–" అని వేడుకున్నాడు.

హరిశ్చంద్రుడి మాటలు విన్నాక అతన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు విశ్వామిత్రుడు.

"హరిశ్చంద్రా ! నీ యౌదార్యం మిక్కిలి శ్లాఘనీయం. నీకు దీర్ఘాయురారోగ్యాలు కలుగు గాక !" అని దీవించాడు. అంతలోనే కఠినత్వాన్ని మళ్ళీ తెచ్చుకొని, "నీవింక నీ భార్యాపుత్రులతో మా రాష్ట్రంబు వదలిపొమ్ము –" అని ఆదేశించాడు. అతని మంత్రి సత్యకీర్తిని మంత్రిగా కొనసాగిస్తూ అతను మాత్రమూ ఇక్కడే వుండాలన్నాడు.

సత్యకీర్తి తాను ఈ విశ్వామిత్రుడితో వేగలేననీ, తనుకూడా హరిశ్చంద్రుడితో కలిసి వచ్చేస్తాననీ వేడుకున్నాడు. కానీ, హరిశ్చంద్రుడు ప్రజల మేలుకోరి ఇక్కడే వుండిపొమ్మన్నాడు అతన్ని !

ఈ వార్త అప్పటికప్పుడే దావానలంలా  రాజ్యంలో వ్యాపించిపోయింది. ప్రజలు కర్రలూ, కత్తులూ పుచ్చుకొని విశ్వామిత్రుడి మీద దాడి చేయడానికి పెద్దసంఖ్యలో అడవి మీద విరుచుకుపడ్డారు.

పట్టుకోండి – కొట్టండి – చంపండి – అంటూ అడివంతా జనకోలాహలంతో నిండిపోసాగింది. రైభ్యుడు, రోహణకుడు, పింగళకుడు... ఇలాంటి పురప్రముఖులంతా తరలివచ్చారు.

"మచ్చుజల్లి మాయగా రాజ్యాన్ని కాజేసి ఈ సచ్చరిత్రుణ్ణి రాజ్యం నుండి తరిమేస్తావుట్రా పచ్చిదొంగ ! నీ తపస్సు పాడుగాను – ఈ జడలు పెంచుకున్నది ఇందుకా –?" అంటూ విశ్వామిత్రుణ్ణి కొట్టబోయారు వాళ్ళు.

హరిశ్చంద్రుడు వారిని వారించేందుకు ప్రయత్నించాడుగాని, అంతకంతకూ జనం ఆవేశంగా రెచ్చిపోతుండడంతో ఆయన ఏమీ చెయ్యలేకపోయాడు.

విశ్వామిత్రుడు కోపంగా ఉరిమి, "ఈ జనాన్ని మొత్తాన్ని ఒక శాపంతో నశింపచేయగలను. కానీ, హరిశ్చంద్రుణ్ణి అదిలిస్తే సరిపోయేదానికి అందరిని బాధించడం

దేనికీ" అనుకున్నాడు. ఆ పౌరుల దేశభక్తినీ, రాజభక్తినీ మెచ్చుకొంటూనే, "ఏం హరిశ్చంద్రా ! రాజ్యం ఇచ్చినట్టే ఇచ్చి, మళ్ళీ పుచ్చుకునేందుకు ఇదో ఎత్తుగడా...?" అనడిగాడు.

హరిశ్చంద్రుడికి ఈ మాట సూటిగా తగిలింది. తలకొట్టేసినట్లయ్యింది ఆయనకి. "పౌరులారా ! ఇలా ప్రవర్తించి నాకు చెడ్డపేరు తెస్తారా –?" అన్నాడు వాళ్ళతో .

"మహా ప్రభూ ! మమ్మల్ని పెద్దపులికి అప్పగించి వెళ్ళిపోతారా –?" అన్నారు దీనంగా పౌరులు.

"దుఃఖించకండి" అని పౌరుల్ని ఓదార్చి, 'సత్యకీర్తీ వీళ్ళందరినీ తీసుకొని పట్టణానికి వెళ్ళిపో ! మేం ఇక్కడినుంచి దూరంగా వెళ్ళిపోతాము –" అని ఆదేశించాడు హరిశ్చంద్రుడు.

"సత్యకీర్తి ! ఇంకా కదలవేంటి ? పోయి రాజధాని నగరాన్నంతా అలంకరించి నా పట్టాభిషేక మహోత్సవం గురించి ఊరంతా చాటింపు వేయించు –" అని అదిలించాడు విశ్వామిత్రుడు.

హరిశ్చంద్రుడు లేని అయోధ్యకు అలంకారం దేనికి – అని గొణుక్కొంటూ భారంగా కదిలాడు మంత్రి సత్యకీర్తి. పౌరులు ఆయన వెంటే నిష్క్రమించారు.

ఇంక హరిశ్చంద్రుణ్ణి తన రాజ్యం విడిచి పొమ్మన్నాడు విశ్వామిత్రుడు. అలాగేనని ఆయన బయల్దేరుతుంటే, ఆపి, వంటిమీద వున్న నగలన్నీ అక్కడపెట్టి వెళ్ళమన్నాడు. మళ్ళీ వెనక్కిపిలిచి –"అరే ! ఎంతటి మోసగాడవురా ! నీ సత్యవ్రతం ఇలాంటిదా ? పరాయి సొమ్ముని పాయసంలాగా తినేయాలనుకొంటున్నావా ? నా డబ్బు నీ దగ్గర దాచుకున్నాను కదా... దాన్నెక్కడ దాచి పెట్టావురా ! ఛీ ! కక్కిన కూటికి ఆశపడతావా ?' ' అని నిలదీసి, తనకు దానం ఇచ్చిన ధనం ఇచ్చి కదలమని నిలేశాడు.

"మునీంద్రా ! ఇంత అన్యాయంగా బాధించడం తగునా ! నా ధరణీ సర్వస్వం మీకే ధారపోశాను కదా... కట్టుబట్టలతో అడవుల్లోకి పోతోన్న మా తలలమీద లేని అప్పులు కట్టి చెల్లించమనడం ధర్మమా–" అని వేడుకోలుగా అడిగాడు.

"మా సొమ్ము మేం అడిగితే లేని అప్పు తలకట్టడం అంటావా?" అని కోపంగా కళ్ళురిమాడు విశ్వామిత్రుడు.

"ఒక నెలరోజులు గడువిస్తే ఎట్లాగైనా ఆ డబ్బు ఇచ్చేస్తాను – నన్నింక వదిలేయండి –" అని ప్రాధేయపడ్డాడు హరిశ్చంద్రుడు.

అప్పుడు విశ్వామిత్రుడు తన శిష్యుడు నక్షత్రకుణ్ణి పిలిచి, ఈ హరిశ్చంద్రుడు నెలరోజుల్లో మన బాకీ తీరుస్తానంటున్నాడు. నువ్వు ఈయన వెంటే వెళ్ళి ఎప్పటికప్పుడు ఈయన ఎంత రొక్కం సంపాదిస్తే అంతా నిర్దయగా వసూలు చెయ్యి, ఏమాత్రం జాలిపడకు. అన్నపానాలకోసం క్షణంసేపయినా వీళ్ళను వదలకు" అని నక్షత్రకుణ్ణి ఆదేశించాడు.

హరిశ్చంద్రుడివైపు తిరిగి – "ఈ నక్షత్రకుడు పరమ సుకుమారంగా పెరిగిన గారాల బిడ్డ. ఈయన్ని నీతో పంపిస్తున్నాను. ఈయనకు ఏలోటూ లేకుండా చూసుకో – అన్నపానీయాలకు లోటు రానీకు –" అని హెచ్చరించాడు. ఎక్కువ శ్రమకు ఓర్వలేడు.

వట్టి అలిపిరి. ఊరికే అలసిపోతాడు. ఆకలైతే అన్నం కావాలని అడగడంకూడా చేతకాదు – కాబట్టి నువ్వే కనిపెట్టి ముప్పూటలా వేళ తప్పకుండా అతనికి ఆహార పానీయాలు సక్రంగా అందించాలి – అని చెప్పాడు.

నువ్వు తిన్నా తినకపోయినా అతనికి కడుపు నిండా పెట్టాలి – అనేది ఈ హెచ్చరికలోని సారాంశం.

"దేవా ! సాధ్యమైనంత వరకూ అట్లే చూసుకొంటాను – నాకింక సెలవిప్పించండి. నక్షత్రేశ్వరా ! రండి !" అన్నాడు బయల్దేరుతూ హరిశ్చంద్రుడు.

అప్పుడు విశ్వామిత్రుడు మరోసారి హితబోధ చేసి చూశాడు.

"అయ్యో! వెర్రి రాజా ! నీకేమి పిచ్చా? నేనిన్ని విధాలా బోధిస్తున్నా, నా అంతవాడి మాటల్ని తోసేసి పదరాని అగచాట్లు తలకెత్తుకొంటానంటావేందయ్యా? ఈ రాజ్యంలో నీకు పిడికెడు అటుకులు దొరక్కుండా కట్టడి చేస్తాను. మా అప్పు ఎట్లా తీర్చగలననుకొంటున్నావు ? ఈ నిష్కారణ బాధలు నీకు దేనికయ్యా ? చక్కదనాల చుక్కలు నా కూతుళ్ళని పెళ్ళాడు... అయినా నా మాట కాదంటావా... ఇంక నీకు కుక్కపాట్లే..." అన్నాడు.

'చంచల శ్రీసుఖ ప్రాకట్యం' నాకు లేదు – ఈ డబ్బు మీద, ఈ తుచ్ఛసుఖాల మీద నాకు వ్యామోహం లేదు... నిశ్చల యశోవాల్లభ్యం – అంటే, మంచికీర్తి మాత్రమే నాకు కావాలి అన్నాడు హరిశ్చంద్రుడు.

ఎంత బెదరకొట్టినా బెదరలేదు. మాలవారి పిల్లల్ని తాకననేదే అతని వాదన.

ఇంక జరగవలసిన కథని ఆలోచించాలనుకున్నాడు విశ్వామిత్రుడు !

## 4

# అడవుల వెంబడి దారిదొరక్క తిరుగుతున్న హరిశ్చంద్రుడు - భార్యాపుత్రులు

ఎంత నడిచినా అడవిలోంచి బైటకు వచ్చే దారి దొరకడం లేదు. జనంలోకి వెడితేగాని, ఏదైనా పని దొరకదు. పని దొరికితే కదా – సంపాదించి విశ్వామిత్రుడి అప్పుతీర్చేది...

రాణివాసపు భోగాలనుభవించవలసిన నిన్నీ ఘోరారణ్యాలకీడ్చి తెచ్చి, కుసుమ సుకుమారమైన నీ శరీరాన్ని ఇలా నడిపించి నలిగేలా చేసిన నన్ను నేను ఏమని నిందించుకోను...? అంటూ దీనంగా మాట్లాడాడు హరిశ్చంద్రుడు.

పాదాల్లో ముళ్ళు గుచ్చుకొని నడవలేక అవస్థ పడ్తున్నా, భర్తని ప్రోత్సహిస్తూనే వుంది చంద్రమతి.



“రాజా ! నీ ప్రయాణం పాడుగాను. మా గురువుగారు నన్ను నీతో ఎలా పంపించాడురా బాబూ? సొమ్ము పుచ్చుకోవాల్సిన ఆయన అక్కడున్నాడు. సొమ్ము చెల్లించవలసిన వాడివి నువ్విక్కడ భార్యాపుత్రులతో సుఖంగా వున్నావు – మీ ఇద్దరి మధ్య కాళ్ళు పడిపోయేలా తిరిగేందుకు నా కర్మం ఏం కాలిందయ్యా... రామ రామ...’ ’ అంటూ కూలబడ్డాడు నక్షత్రకుడు.

కొంచెం చెట్టునీడలోకి వెడదాం రమ్మన్నాడు హరిశ్చంద్రుడు. “ముందు నాకింత నీరు ధారకము పోయవయ్యా !” అని విసుక్కున్నాడు నక్షత్రకుడు.

దగ్గరలో నీరెక్కడా కన్పించలేదు. అందరికీ దాహం విపరీతంగా వేస్తోంది. మాట్లాడేందుకు కూడా మాట పడిపోతోంది.

“నీళ్ళు లేనిచోటికి తెచ్చి, ఏ పెద్దపులికో ఆహారంగా వేస్తే అప్పుఅడిగేవాడే లేకుండా పోతాడని నీ ఎత్తుగడ – అందుకే ఇక్కడికి తెచ్చావు –” అని నిందించాడు నక్షత్రకుడు.

ఇంకొకవైపు ఆకలికోసం పిల్లవాడు లోహితాస్యుడు కూడా ఏడుస్తున్నాడు...

*“శ్రేయోబంధుర సార్వభౌమ పదవి శ్లేషంబు ప్రాప్తించె బో*
*యీ యధ్వానమరణ్య మధ్యమున స్వామీ యన్నమో రామచం*
*ద్రా! యంచున్ విలపించుచుంబ్రియసుతుండల్లాడగా జూచియున్*
*సాయంబేమియు జేయలేని గతియే నన్నేచుటే పాపమౌ –”*

అని హరిశ్చంద్రుడు కూడా దుఃఖసాగరంలో మునిగిపోయాడు –

అప్పుడు చంద్రమతి అందరినీ ఓదార్చింది. ఈ దుఃఖపు నట్టేట్లోపడి ఏడుస్తున్న వీళ్ళందరిని కాపాడే దీనజన రక్షాదక్షాలు ఎక్కడ... అని దైవాన్ని ప్రశ్నించిందామె ! పుట్టించేవాడెట్లో పెట్టకమానునా అనే మాట నిజమే అయితే పట్టెడన్నం దొరక్క మేమిలా

నశించిపోతామా ? అంటూ తాను నమ్మిన దైవాన్ని తమను కాపాడవలసిందిగా ప్రార్థించింది.

ఆమె పాతివ్రత్య మహిమతో నాలుగు కల్పవృక్షఫలాలు నేలరాలాయి. ఒకపండు లోహితాస్యుని తీసుకోమని, ఇంకొక పండుని నక్షత్రకుడికి పెట్టమన్నది తల్లి. ఆమె మహిమతో దూరంగా సరోవరం కన్పించింది. ఈ పండుని తిని, ఆ నీరు తాగి ప్రాణాలు కాపాడు కోవలసిందిగా అతన్ని సూచించింది.

నీరు, ఆహారం దొరుకుతుందేమోనని వెదుకుతూ వెళ్ళిన హరిశ్చంద్రుడికి ఎదురువెళ్ళి ఫలాలు, సరస్సు గురించి చెప్పి వెనక్కి తీసుకొచ్చింది చంద్రమతి. అందరూ ఫలాల్ని భుజించారు. నీరు తాగారు. ఆ పూటకి ప్రాణాలు నిలిపారు.

అదృశ్యరూపంలో ఇదంతా గమనిస్తున్నాడు విశ్వామిత్రుడు.

ఇంద్రుడు వీటిని ఏర్పాటు చేశాడేమోనని అనుమానించాడు. లేదా ప్రకృతే ఆమెకు సహకరించిందేమో అనుకున్నాడు.

విశ్వామిత్రుడు సృష్టించిన మాయా ఋషి దంతవక్రుడు దగ్గరలో ఒక పెద్ద మర్రిచెట్టు వుందని, అక్కడ విశ్రాంతి తీసుకోవచ్చని భేతాళ వృక్షాన్ని సూచిస్తాడు.

హరిశ్చంద్రుడు అది నమ్మి, భూతప్రేతాలు తిరిగే ఆ మర్రిచెట్టు దగ్గరికి అందరినీ చేర్చాడు. అందరూ నిద్రావస్థలో వుండగా భేతాళుడు వాళ్ళమీద పడ్డాడు.

వెంటనే హరిశ్చంద్రుడు ఎవరికీ నిద్రాభంగం కాకుండా అవతలికి లాక్కుపోయి ఆ భేతాళుణ్ణి వధించాడు.

“నక్షత్రకా! భయపడకు. మనకపాయం తొలగింది. నా భర్త ఆ భూతాధముణ్ణి సంహరించాడు కదా...” అని ఖంగారు నటిస్తున్న నక్షత్రకుణ్ణి ఓదార్చింది చంద్రమతి.

ఈ దెయ్యాలమారి చెట్టు దగ్గర వుండనని మారాంచేశాడు నక్షత్రకుడు.

అంతలో దూరంగా వెల్తురు కన్పించింది. కొరివిదయ్యం అనుకొని భయపడ్డాడు నక్షత్రకుడు. కాదు, కార్చిచ్చు ! దావానలం చుట్టూ ముట్టుకొస్తోంది. చూస్తుండగానే అడవి అడవంతా భీకరంగా తగలబడుతూ మంటలు వాళ్ళని చుట్టుముట్టుకు రాసాగాయి.

మునిరుణం తీర్చకుండానే ఈ దావానలంలోపడి మాడిపోవాల్సివస్తోందని హరిశ్చంద్రుడు దుఃఖించసాగాడు. అందరూ ప్రాణభయంతో హడిలిపోతుంటారు.

చంద్రమతి, మంటలకు ఎదురువెళ్ళి, శ్రీమన్మహాయజ్ఞమూర్తి అయిన అగ్నిదేవుణ్ణి స్తుతిస్తూ ప్రార్థిస్తుంది. అగ్ని చల్లారిపోతుంది.

అంతా అదృశ్యరూపంలో విశ్వామిత్రుడు గమనిస్తూనే వుంటాడు. ఆహా! ఆ పవిత్ర పతివ్రతామతల్లి ప్రభావం ముందు మా మహిమలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయే... వీళ్ళంతా కాశీపట్నం చేరతారు – అక్కడ ఏం చెయ్యాలో ఆలోచించాలి – అనుకొంటాడు.

“మీ సత్యవ్రత దీక్షవలనే మనం అంతా బతికి బయటపడగలిగాం...” అన్నది వినయంగా చంద్రమతి – భర్త హరిశ్చంద్రుడితో !

అందరూ కాశీవైపు ప్రయాణం అయ్యారు.

# 5

# కాశీపట్టణంలో హరిశ్చంద్రుడు

*భక్తయోగపదన్యాసి ! వారణాసి !*
*భవదురిత శాత్రవఖరాసి ! వారణాసి !*
*స్వర్గదీతట సంభాసి ! వారణాసి !*
*పావనక్షేత్రముల వాసి ! వారణాసి !*

అందరూ కాశీ విశ్వేశ్వరుని సందర్శించుకున్నారు. ఇలా గుళ్ళూ, గోపురాలూ పట్టుకు తిరుగుతూ కాలక్షేపం చేస్తే అప్పుతీరేదెలా... డబ్బు సంపాదించే ఉపాయం చూడమని హెచ్చరించాడు నక్షత్రకుడు.

"అప్పు ఎగవేయాలనుకొంటే, చెప్పు – నా దారిన నేను పోతాను–" అని రెట్టించాడు. "సొమ్మీయవలసినవాడివి, నువ్వు తొందరపడకపోగా పుచ్చుకోవలసిన నన్నుకూడా తొందరపడవద్దని నీతులు చెప్తున్నావా...?" అని కసురుకున్నాడు.

"పుట్టెడు అప్పులో మునిగిపోయావు. ఇంకొక పుట్టెడైనా నీ పుట్టి మునిగేదేం లేదు ఇంత కూడా ! ప్రొద్దున్నే నీ ముఖం ఇంత చూసినా అన్నం పుట్టదు ఆరోజున ఎవరికీ ! దీపం వుండగా ఇల్లు చక్కబెట్టుకోకపోవడం మా గురువు గారికి తెలియకుండా పోయింది–" అంటూ మాటలతో వెనకపడి వేధించసాగాడు నక్షత్రకుడు.

"అయ్యా ! అలా తిట్టకండి –" అంటే, "నేను మాట్లాడితే తిట్టినట్లుందా – ?" అని నిష్ఠూరాలాడాడు. "ఇప్పటికి ఒక్కపైసా ఇవ్వలేదే – ఇంకా ఇస్తావన్న నమ్మకం కూడా లేదు ... మా జుట్టు నీ చేతికి చిక్కిందిలే ! ... పత్రాలా ? సాక్ష్యాలా ? నిన్ను రచ్చకీడ్చడానికి మా దగ్గర ఏ ఆధారం లేదు కదా... అదా నీ ధైర్యం...?" అని మళ్ళీ రెట్టించాడు.

"ఇచ్చేస్తాను – అప్పు తీర్చేస్తాను" అని మళ్ళీ మళ్ళీ మొత్తుకున్నాడు సత్యహరిశ్చంద్రుడు. "ఎట్లా తీరుస్తావయ్యా ... వైదిక వృత్తిచేసి సంపాదిస్తానంటివా... నీవన్నీ రాచపోకడలే ! ఆ వృత్తికి పనికిరావు. పోనీ, ఆ రాచరికపు శౌర్యంతో సంపాదిస్తావంటే, నీకు రాజ్యం లేదు, పరివారం లేదు – నీ శౌర్యంతో నువ్వు సాధించేదేం వుంటుందీ... అలాగని, ఏ వ్యాపారమో చేసి డబ్బు మూటలు కడ్తావంటే, పెట్టుబడికి నీ అరచేతిలో గుడ్డి గవ్వయినా లేదు. వ్యవసాయం చేసి సవరిస్తావంటే, గోష్పాదమంత భూవసతి కూడా లేదు. ఇందులో ఏ వృత్తిని చేసి, నెలరోజుల్లో నిలువెత్తు ధనాన్ని సంపాదించి అప్పు తీరుస్తానంటావు ...? ఇవేవి కావు – ఎవడో ఒకడి దగ్గర కట్టుబానిసగా వుండి సంపాదిస్తానన్నా నిన్నెవరూ కొనేవారే లేరు. ఎందుకొచ్చిన దురవస్థ గానీ, నేను వెళ్ళి

మా గురువుగారికి నీ కష్టాలన్నీ చెప్పి ఈ సొమ్ము వదిలేయమంటాను – !!” అన్నాడు నక్షత్రకుడు. మొత్తం మీద సుదీర్ఘమైన హితబోధే చేశాడు. కానీ, హరిశ్చంద్రుడు మాటతప్పేందుకు ఏమాత్రం అంగీకరించలేదు.

అప్పుడు చంద్రమతితో అన్నాడు నక్షత్రకుడు – “మీకే లేని బాధ నాకుమాత్రం దేనికి... మాకు రావలసిన సొమ్ము గవ్వలతో కూడా లెక్కపెట్టి మాకిప్పించు – నేనింక క్షణం ఆగను – మీ మీద మొహమాటంతో ఇన్ని రోజులు ఆగాను. మరి ఆలస్యం చేస్తే మా గురువుగారు ముక్కోపి – నాగొంతు కొరికేస్తారు. ఇంక పెద్దా – చిన్నా లేదు – హరిశ్చంద్రా. మా సొమ్ము గుమ్మరించి నడు–” అని !

హరిశ్చంద్రుడికి దుఃఖం ఒకటే తక్కువ. ఒకవైపు నక్షత్రకుడి సూటిపోటి మాటలు. మరోవైపు ఆకలి – ఆపైన అప్పు తీర్చే ఉపాయం దొరక్క అవస్థ...

ఋణబాధ ఎంత భీకరంగా వుందో చూడమంటూ చంద్రమతితో హరిశ్చంద్రుడంటాడు–

తోటివారి ముందు నగుబాటు

తరువాత మనశ్చాంచల్యరోగం.

అనంతరం ఆహారం సహించదు.

అటుమీద అనారోగ్యం

ఆపైన మరణమే శరణమనే దుస్థితి –

అలాగే దిగులుతో మంచానపడి తీసుకొని తీసుకొని మరణించడం... ఈ మనుషులకు అప్పుకంటే కష్టమైనది ఇంకొకటి లేదు కదా!” అంటాడు.

ఇంత జరిగినా చంద్రమతి తన సహనాన్ని వదల్లేదు. భర్తని ఓదార్చింది. “కాలవశాన సర్వ సంపదలూ పోగొట్టుకున్నాం – ఇంక మిగిలింది మీకు నేను... నాకు మీరూ...



ఏ డబ్బున్న వాడికో నన్ను బానిసగా అమ్మేయండి – కొంత డబ్బు వస్తుంది కదా... దాన్ని ఈ నక్షత్రకుడికి ఇవ్వండి –" అని సలహా చెప్పింది.

అంతటి రాజ చంద్రుడికి ఆత్మజవైన చంద్రమతి రాకుమార్తెని ఇలా కట్టుబానిసగా అమ్మడంకన్నా నీచం ఇంకొకటి వున్నదా... అని రోదించాడు హరిశ్చంద్రుడు.

"ఈ నీచానికి తలపడ్తోంది... కేవలం సత్యప్రతిష్ఠకే కదా... తప్పులేదు–" అన్నది చంద్రమతి.

వీధుల్లో సిగ్గుఎగ్గులు వదిలేసి భార్యని అమ్మకానికి నిలబెట్టవలసిన దురవస్థ వచ్చినందుకు హరిశ్చంద్రుడు చాలా దుఃఖించాడు.

"అలా ఏడుస్తుంటే, నువ్వు అమ్ముతావని ఎవరికి తెలుస్తుంది – అందరికీ వినబడేట్లు బిగ్గరగా అరిచి చెప్పు –" అన్నాడు మళ్ళీ నక్షత్రకుడు. కొనేవాళ్ళంతా ఇక్కడే వున్నారని కూడా అన్నాడు.

అన్నింటికి తెగించేవున్నాను – అంటూ, తన భార్య అమ్మకానికుందని అరవడం మొదలుపెట్టాడు హరిశ్చంద్రుడు.

అప్పుడు కాలకౌశికుడనే బ్రాహ్మణుడు వచ్చి హరిశ్చంద్రుణ్ణి నువ్వెవరివంటూ గట్టిగా నిలదీశాడు. "ఈమె నాకు అదృష్టముచేత లభించింది. నేను హరిశ్చంద్రుణ్ణి – ఈమె నా భార్య చంద్రమతి" అని చెప్పుకున్నాడు.

అది విని కాలకౌశికుడు బిగ్గరగా నవ్వాడు. "ఓరి అమాయకుడా! పత్రాలు, సాక్ష్యాలు లేని అప్పుకోసం నిక్షేపం లాంటి యిల్లాల్ని, అమ్ముకొంటావా? ఓ పనిచెయ్యి... విశ్వామిత్రుడి దగ్గరకి నన్ను తీసుకెళ్ళు ! నీ పక్షాన నేను వాదిస్తాను – ఒకడికి పది సాక్షులు సంతకాలు చేసిన పత్రాల్నే ఎగవేయడంలోగాని, దారిన పోయేవాడి మీద లేని అప్పులు అంటగట్టి డబ్బు గడించడంలోగానీ, నన్ను మించినవాడు లేడు – విశ్వామిత్రుడు గిశ్వామిత్రుడు నిన్నేం చేయగలడో చూస్తాను –" అన్నాడు.

హరిశ్చంద్రుడు ఎట్టి పరిస్థితుల్లోనూ అందుకు ఒప్పుకోలేదు.

'సరే ! బాగుపడే యోగం లేదు నీకు ! నీ భార్యని ఎంతకమ్ముతావో చెప్పు –" అన్నాడు కాలకౌశికుడు.

"చెప్పవయ్యా నక్షత్రకా..." అని హరిశ్చంద్రుడు అనగానే, ఏనుగు మీద ఒక బలవంతుడైన మనిషి నిలబడి పైకి రత్నాన్ని విసిరితే ఎంత పైకి ఎగురుతుందో అంతటి డబ్బు నిచ్చి ఈమెని తీసుకో–" అని చెప్పాడు నక్షత్రకుడు.

"ఇదేం చౌకబేరం కాదురా!" అన్నాడు కాలకౌశికుడు తన శిష్యుడితో !

"మరి, పంచాంగం కట్టకే ఇంతటి బానిస దొరుకుతుందనుకున్నావా?" అన్నాడు ఎద్దేవా చేస్తూ నక్షత్రకుడు. కాలకౌశికుడికి పౌరుషం వచ్చింది –" దీన్ని మా ఇంటికి పంపించు – ధనమిస్తాను – హరిశ్చంద్రా ... సరేనా..." అన్నాడు.

పదపద అని బెత్తంతో అదిలిస్తూ, గొడ్డును తోలుకెళ్తున్నట్లు తోలుకెళ్ళసాగాడు చంద్రమతిని కాలకౌశికుడు. కన్నీటితోనే తన భర్త పాదాలను కడిగి ప్రణతులిచ్చింది చంద్రమతి.

"ఏమయ్యా ! శుభమస్తు అని మా గురువుగారు దాసిని కొనుక్కుంటే, మీరిలా అశుభంగా ఏడుస్తారేంటి... పద పద... అని కాలకౌశికుడి శిష్యుడు కేశవుడు చంద్రమతిని అదిలించాడు.

అదిచూసి, లోహితాశ్యుడికి చాలాకోపం వచ్చింది. "మా అమ్మని ఇట్లా ఈడుస్తావుట్రా... నిన్నిప్పుడే గుద్ది చంపేస్తాను – దూరంగా నిలబడి మాట్లాడు –" అన్నాడు.

దానికి కేశవుడు వ్యంగ్యంగా నవ్వి, "ఒరే దాసీపుత్రుడా... కూటికి లేకపోయినా నీకెంత రాజసం వుందిరా..." అని లోహితాస్యుడుణ్ణి కిందపడదోశాడు.

లోహితాస్యుడు ఏడుస్తూ లేచి ఒళ్ళు దులుపుకొని తండ్రివంక చూశాడు.

ఇదంతా గమనించి, కాలకౌశికుడు "ఏమయ్యా హరిశ్చంద్రా... నీ కొడుకు ఇట్లా అంటున్నాడు. రేపు మా ఇల్లు అల్లకల్లోలం చేస్తాడో... ఏమో..." అన్నాడు.

ఇప్పుడీ కాలకౌశికుడు ఈ బేరం వద్దంటే కథ మళ్ళీ మొదటికొస్తుంది. అందుకని, కాలకౌశికుణ్ణే బతిమాలుకున్నాడు... అయ్యా! మీరూ బిడ్డా పాపల్ని కన్నవారే కదా... నా బిడ్డని మీ బిడ్డల్లో ఒకడిగా చూసుకోండి... కడుపు కక్కుర్తి కొద్దీ బతిమాలుకుంటున్నాను–" అని ప్రాధేయపడ్డాడు.

అక్కడ, కాలకౌశికుడి ఇంటిదగ్గర ఆయన ఇల్లాలు కాలకంటకి రంకెలెయ్యడం మొదలుపెట్టింది. కాలకౌశికుడు ఇంటికి రాగానే, ఆలస్యంగా వచ్చాడని, పట్టుకొని వీపు మీద ధబీధబీమని బాది తెచ్చిన సొమ్మెంతో ఇమ్మంది.

ఇంటింటికీ యాయవారం (బ్రహ్మణుల బిచ్చం) ఎత్తి, శవాలు మోసి, ఆ పూట సంపాదించిన మూడు మాడల్ని బొడ్లోంచి తీసి ఆమెకిచ్చి, ఇవ్వాళ ఇంతే వచ్చాయన్నాడు. తక్కువ సొమ్ము తెచ్చినందుకు మళ్ళీ వీపుమీద కొట్టి, "నీ శక్తి మండిపోను... ముసలితనం వచ్చినా నీకెంత మదం వుందిరా... ఓ ... ఎవరయ్యా... నా మొగుడు నన్ను చంపుతున్నాడు రండయ్యా ..." అంటూ తన మొగుణ్ణి కొట్టి తనే అరవడం మొదలుపెట్టింది.

"ఓసీ ... నీ పుణ్యం... అరవకే... నువ్వసలే సుకుమారివి... నువ్వింట్లో పనిచేసుకోలేవని, ఈ దాసిదాన్ని తెచ్చాను–" అన్నాడు.

"అమ్మా ! కాలకంటకీ ! ముసలిమొగుణ్ణి పట్టుకొని అలా కొట్టడం ఏం న్యాయం తల్లీ–" అంటూ చంద్రమతి ఏదో చెప్పబోయింది.

"నా మాటకి లోబడి వున్న నా మొగుడి నిబద్ధిని చెడగొడ్తావా?" అని చంద్రమతి మీద విరుచుకుపడబోయింది కాలకంటకి.

"చంద్రమతీ ! నువ్వెప్పుడూ మా ఆవిడతో ఇలా మాట్లాడకూడదు – నోరుమూసుకొని పడి వుండు –" అని మందలించాడు కాలకౌశికుడు.

అలా కాలకంటకికి బానిసగా బతకడానికి సిద్ధపడింది చంద్రమతి.

H H H



కాలకౌశికుడు ఇచ్చిన డబ్బు పుచ్చుకొని నక్షత్రకుడు హరిశ్చంద్రుణ్ణి విశ్వేశ్వరుడి దేవాలయం దగ్గర కలిశాడు.

"ఈ డబ్బు నా బత్తెం కింద సరిపోయింది. మరి మా గురువుగారి అప్పుమాట ఏమిటీ–" అన్నాడు నక్షత్రకుడు.

నక్షత్రకుడు ఇలా అడ్డం తిరుగుతాడని ఊహించని హరిశ్చంద్రుడికి మతి పోయినట్లయ్యింది. "నువ్వు నీ గురువుగారి పనిమీద వచ్చావు – బత్తెం ఇస్తే ఆయన ఇవ్వాలి గానీ, నేనెందుకివ్వాలి ?" అని ఎదురు తిరిగాడు.

"ఈ డబ్బుని నా బత్తెం కింద తీసుకొని నేను నా దారిన పోతున్నాను. విశ్వామిత్రుల వారి అప్పు సంగతి మీరూ మీరూ చూసుకోండి – చివరికి ఏ గంగలోనయినా దూకండి – నాకనవసరం" అని తెగేసి చెప్పాడు నక్షత్రకుడు.

నక్షత్రకుడి చేతులు పట్టుకొని "ఇది నీకు తగదయ్యా!" అని బతిమాలుకున్నాడు హరిశ్చంద్రుడు. "ఏంటీ – చెయ్యి పట్టుకుంటున్నావు ? కొడతావా ...?" అన్నాడు నక్షత్రకుడు. "నాకంత సాహసం లేదయ్యా –" అని నెత్తీనోరూ కొట్టుకొన్నాడు హరిశ్చంద్రుడు.

ఇంక చేసేదేమీ లేక, "నక్షత్రకా ! ఇంతకన్నా నే చేసేదేముంది? నన్ను కూడా అమ్ముకొని మీ గురువు అప్పు రాబట్టుకో..." అన్నాడు హరిశ్చంద్రుడు... గత్యంతరం లేని నిస్సహాయ స్థితిలో !

"నిన్నెవరు కొంటారయ్యా–" అని వ్యంగ్యంగా అంటూనే... "కోరిన ధనమిచ్చి కొనదగుసుండీ... వారణాసి పౌరవరులార రండి –" అని అరవడం మొదలుపెట్టాడు నక్షత్రకుడు.

అప్పుడు హరిశ్చంద్రుణ్ణి పెద్దింటి కులం (మాదిగ) వాడు వీరబాహుడు కొనడానికి ముందుకొస్తాడు.

"దొరా! బానిసోణ్ణి అమ్ముతుండవా ? నే గొంటానండీ... ధర చెప్పండి –" అన్నాడు.

"చెప్తాగాని, నువ్వు దూరంగా వుండి మాట్లాడు. నేనిప్పుడు స్నానం చెయ్యలేను –" అని ఆ అంటరానివాణ్ణి చీదరించుకొంటూనే మాట్లాడాడు నక్షత్రకుడు.



"నక్షత్రకా ! నన్నీ కడజాతివాడికే అమ్ముతావా ?" అంటూ భోరున ఏడ్చాడు హరిశ్చంద్రుడు.

చేసేది బానిసత్వం అయినా, కడజాతివాడి దగ్గర పనిచేయడం కష్టమే అన్పించింది హరిశ్చంద్రుడికి !

కానీ, నక్షత్రకుడు అడిగిన ఏనుగు మీద మనిషి రత్నాన్ని విసిరేసినంత ఎత్తు ధనరాసి ఇవ్వడానికి ముందుకొచ్చింది అతనొక్కడే కాబట్టి "అయ్యా ! నన్ను వీనికే విక్రయించు – నేను అన్నింటికీ సిద్ధంగానే వున్నాను –" అన్నాడు. మాల వారి పిల్లల్ని పెళ్ళిచేసుకోవడానికి, మాదిగాని దగ్గర పని చేయడానికి ఇష్టపడని హరిశ్చంద్రుణ్ణి, ఆనాటి చాతుర్వర్ణ వ్యవస్థకు సంరక్షకుడిగా చిత్రించడంలో బలిజేపల్లి కవి గారు గొప్ప చాకచక్యం

చూపించారు. హరిశ్చంద్రుడు అబద్ధం ఆడననేది – చాతుర్వర్ణ వ్యవస్థను కాపాడతానని చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడేనని ఇక్కడ మనం అర్థం చేసుకోవాలి.

తనను అమ్మినందుకు రావలసిన సొమ్ముని వీరబాహుడు అందించాక "హరిశ్చంద్రా ! నీ ఋణం తీరిపోయింది" అని వదిలేశాడు నక్షత్రకుడు. అప్పటిదాకా నక్షత్రకుడు అనేక రకాలుగా హరిశ్చంద్రుడిని కష్టపెట్టినందుకు క్షమించమన్నాడు. పెద్దంతరం, చిన్నంతరం చూడకుండా నోటికొచ్చినట్లల్లా మాట్లాడినందుకు నక్షత్రకుడు పశ్చాత్తాపపడి క్షమాపణలు అడిగాడు హరిశ్చంద్రుణ్ణి.

"విశ్వామిత్రుడు కూడా వశిష్ఠుడి మీద కక్షసాధించడానికే ఇదంతా చేస్తున్నాడు గానీ, ఆయనకి వేరే దురుద్దేశం లేదనుకొంటాను'' అని సమర్థించుకున్నాడు. వీరబాహుడిచ్చిన డబ్బు పుచ్చుకొని హరిశ్చంద్రుడి దగ్గర శలవు తీసుకున్నాడు.

"రావయ్యా ! హరిశ్చంద్రుడా ! కుండెత్తుకొంటావా ?" అన్నాడు వీరబాహుడు.

## 6

కాశీపురం స్మశాన వాటిక దగ్గర కాలకౌశికుడి శిష్యులు ఆడుకొంటూ వుంటారు.

లోహితాస్యుడు "ఆటలు వద్దు – అయ్యవారలు ముక్కోపులుగా వున్నారు. దర్భలు కోద్దాం రండి –" అని వారిని వారించాడు. ఆరోజున అందరికన్నా ఎక్కువ దెబ్బలు లోహితాస్యుడికే పడ్డాయిట... అందుకని ఆ పిల్లవాడు శ్రద్ధగా దర్భలు కోయడం మొదలుపెట్టాడు.

"ఈ పూలతావి చక్కగా వుంది. ఈ పూలని కాలకంటకి అమ్మగారి కోసం తీసుకువెడతాను – ఈ పుట్టమీద దర్భలు బాగా పెరిగివున్నాయి – అందరికన్నా నేనే



ఎక్కువగా కోసి, అమ్మగారి మెప్పు పొందాలి–" అనుకొంటూ లోహితాస్యుడు పాముపుట్ట ఎక్కి దర్భలు కోయబోతాడు. పుట్టలోపాము బుస్సునలేచి లోహితాస్యుణ్ణి కాటువేసింది.

లోహితాస్యుడు పెద్దగా అరుస్తూ వెనక్కి విరుచుకుపడిపోయాడు.

శిష్యులు అతనికి ఉపచారం చెయ్యబోతే, "వద్దు మీరు త్వరగా వెళ్ళండి ఆలస్యం అయితే, అమ్మగారి చేతిలో దెబ్బలు పడతాయి –" అనివారించాడు. చనిపోయే సమయంలో తల్లి తన దగ్గర లేదని బాధపడ్తాడు లోహితాస్యుడు. చంద్రమతికి ఈ సంగతి చెప్దామని పరిగెడతారు శిష్యులిద్దరూ.

ఆ సమయానికి చంద్రమతి అడవిలో పిడకలేరుతూ తన దుస్థితి తలచుకొని దుఃఖంలో మునిగిపోయి వుంది.

"ఆ రోజు కాలకౌసికుడు హడావిడి చేయడంవలన మనసారా మిమ్మల్ని కౌగలించుకోలేకపోయాను. కళ్ళనిండా నీళ్ళు కమ్ముకోవడంతో కనులారా మిమ్మల్ని చూసుకోలేకపోయాను. దుఃఖం పొంగి గొంతులో కఫం అడ్డుపడటంతో నోరారా మీతో మాట్లాడలేకపోయాను. చివరకి ఈ కర్మానికి నన్నప్పగించి పోలేక పోలేక కదిలారు మీరు – ఎక్కడున్నారో మీరు – అసలున్నారో – ఈ భూమ్మీద లేరో..." అంటూ బావురుమని ఏడ్చింది చంద్రమతి.

చంద్రమతిని వెతుక్కొంటూ వస్తున్న బ్రహ్మచారులిద్దరినీ చూసి, తన ముద్దుల బిడ్డ ఏమయ్యాడోనని ఖంగారు పడిందామె.

"మిత్రులారా ! నన్నొక పెనుపాము కరిచింది" అంటూ మీ లోహితాస్యుడు విరుచుకు పడిపోయాడు. ఇదిగో... తిన్నగా ఇదే దారిలో పెద్ద మర్రి చెట్టు కన్పిస్తుంది – అక్కడే జరిగింది ఇది –" అని వాళ్ళు ఆమెకు ఆనవాలు చెప్పారు.

కానీ, తన యజమానురాలు చెప్పిన పని వదిలి... ఆమె అనుమతి లేకుండా ఎలా పోగలదు ? ... కొడుకు శవాన్ని చూడటానికైనా సరే...

"అయ్యో ! దుఃఖభారంతో సేవాకృత్యాన్ని మరిచిపోతున్నాను – స్వామి ఆజ్ఞ తీసుకొనే కొడుకు పడివున్నచోటుకి పోయి చూసిరావాలి... అమ్మా ! కాలకంటకీ... పోయి రమ్మంటావా..." అని తన యజమానురాలి అనుమతి అడగబోయింది చంద్రమతి.

కానీ, అప్పటికే, పిడకలేరుకురావడం ఆలస్యం అయ్యిందని తిట్టడం మొదలుపెట్టింది కాలకంటకి. కొడుకుని పాము కరిచిన సంగతి చెబితే "మాకు డబ్బు ఖర్చయ్యేందుకు నువ్వెక్కడినించి దాపురించావే..." అని మళ్ళీ తిట్టింది.

"ఇంట్లో చెయ్యవలసిన పనులెన్నో వుంటే, అవన్నీ వదిలి ఎక్కడకో పోయొస్తానంటావా...? నువ్వు వెళ్ళిపోతే, ఈ పని మీతాత చేస్తాడనుకున్నావా... నోర్మూసుకొని పని చూసుకో –" అంది.

"పాము కరిస్తే వైద్యం చేయించడానికి మా దగ్గర డబ్బులేవు–" అని కసురుకొంది. దర్భలు తెమ్మంటే, పుట్టలెక్కమని ఎవడు చెప్పాడు ? పుట్టలెక్కితే పాములు కరవకుండా వుంటాయా ? అని ఎద్దేవా చేసింది. పనులన్నీ అయ్యాక రాత్రికి మమ్మల్ని నిద్రపుచ్చి, అప్పుడు నీ కొడుకుని వెతుక్కొంటూ వెళ్ళు అని కఠినాతికఠినంగా చెప్పేసింది కాలకంటకి.

గుడ్లనీళ్ళు కుక్కుకొంటూ పనిలోకి వెళ్ళిపోయింది చంద్రమతి !

H H H

ఒక కుండని భుజం మీద పెట్టుకొని ఒక చేత్తో పుచ్చుకొని, ఇంకో చేత్తో కర్రని పట్టుకొని గొంగళి కప్పుకొని హరిశ్చంద్రుడు స్మశానం దగ్గరికి వచ్చాడు –

యజమాని వీరబాహుడు హరిశ్చంద్రుడికి పేరు మార్చి వీరదాసుడని పేరుపెట్టి ఆపేరుతోనే పిలుస్తున్నాడు.



ఈ రాత్రికి స్మశానానికి కాపలాగా వుండి, ప్రొద్దున్నే వస్తూ ఈ కుండనిండా కల్లుపట్టి తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు వీరబాహుడు.

"ఆహా ! సురాభండమా ! నీవు కడు పుణ్యురాలవు – కావుననే విశ్వామిత్రుడి సహాయ సంపత్తిచే విశ్వ విశ్వంభరా దేవికి నాస్థానంబగు నా భుజపీఠిపై నిట్లధిష్ఠించి యున్నావు – కానీ, నేనిప్పుడు శ్మశానవాటికకే వెళ్ళెదను. అంధకారమప్పుడే బ్రహ్మాండ మంతయూ ఆవరించి, కన్నులున్న వారిని కూడా గుడ్డివాళ్ళను చేస్తోంది –" అని తనలోతానే అనుకొంటూ, ఖాళీకుండని మోసుకొంటూ స్మశానంవైపు నడుస్తున్నాడు హరిశ్చంద్రుడు.

సరిగ్గా అదే సమయానికి స్మశానంలో ఎవరో వంటరి మనిషి కదులుతున్నట్లు అనిపించింది.

కావలికాయడానికి వచ్చిన హరిశ్చంద్రుడు అనే ఈ వీరదాసు అటువైపు పరిగెత్తి, సగంకాలి నిట్టనిలువుగా లేచిన శవాన్ని చూసి మనిషని భ్రమించానే... అయ్యో... అనుకున్నాడు.

అనుకొంటూనే, ఆ శవాన్ని తన చేతికర్రతో తగలబడ్తున్న చితిమీదకి నొక్కిపెట్టాడు.

"స్మశాన రాజ్యాభిషిక్తుడనయినా నాకు ఇదే సింహాసనం" అని ఓ సమాధి అరుగుమీద కూర్చున్నాడు.

అతని జ్ఞాపకాలన్నీ కళ్ళముందు ముసురుకొంటున్నాయి. నిత్యదుఃఖితుడికి కొత్తగా దుఃఖం వచ్చేదేముంది – జీవిస్తోన్నదే దుఃఖంలో కదా !

"నాథా ! సత్యప్రతిష్ఠకై యొనర్చు నీచకృత్యములు సగౌరవములే..." అంటూ బానిసగా అమ్ముడు పోవడానికి సిద్ధపడిన తన భార్య చంద్రమతి..., "దాసీ! కదలవేమి–" అని అదిలించిన కాలకౌశికుడు, "మా అమ్మని ఈడ్చుకెళ్తావుట్రా" అని ఎదురు తిరిగిన లోహితాశ్యుడు... అందరూ ఆయన కళ్ళముందు మెదిలారు.

ఈ దుఃఖ ప్రాబల్యంలో తాను తన కర్తవ్యాన్ని మరచిపోతున్నానని గుర్తించాడు హరిశ్చంద్రుడు.

స్మశానానికి కావలికాయాలి... ఎవరిదో ఏడుపు వినిపిస్తోంది. ఆడగొంతు...

"అయ్యో ! సాహసంబు చేసి, ఇచ్చటికి వచ్చితిని... ప్రాణాలకు రోసిన నాకు సాహసం గాక ఇంకేముంది...? కులవర్ధనుడైన నీలాంటి కొడుకు ఇట్లా కాటిపాలైపోయె! నేనింక బ్రతికి ఏమి ప్రయోజనం ...? తనయా ! నువ్విక్కడ పడుకో... నీ దహనం కోసం ఇన్ని చితుకులైనా పోగుచేసుకొస్తాను–"అని లోహితాస్యుడి శవాన్ని స్మశానంలో ఒకచోట పడుకోబెట్టి, ఇలాంటి కష్టకాలంలో తన భర్త తన దగ్గర లేకుండా పోయాడే... అని దుఃఖిస్తోందామె !

కటిక చీకటిగా వుంది. అసలే స్మశానం. అర్ధరాత్రి దాటిపోయింది. తెల్లవారేలోగా దహన కార్యక్రమం ముగించుకుని కాలకంటకి నిద్రలేచేసరికి ఇంట్లో కన్పించాలి.

ఎంత ప్రయత్నించినా ఆమెకు కట్టెలు దొరకలేదు. కొడుకు శవానికి దహన క్రియలు చెయ్యడం ఎట్లాగో తోచలేదామెకు ...

"రాజాధిరాజు కుమారుడవైన నీకు కాలవశాన కష్టాలు వచ్చాయి ! చచ్చిపోయిన తర్వాతయినా నీ దహన విధి యథావిధి జరిపించలేకపోతున్నాను – చివరికి ఈ వల్లకాట్లో ఎవరిదో ఒకడి చితిలో సగం కాలిన కట్టెలు దొరికాయి. చివరికి ఇవే నీకాధారం అయ్యాయి నాయనా ...

నవమాసాలు మోసి, కని, ముద్దుముచ్చట్లతో పెంచిన నీ కన్నతల్లే చివరికి తలకొరివి పెడ్తోంది ... ఛీ ! ఛీ ! చంద్రమతి... నీవెంత రాకాసివే...

కనీసం నీ భర్తకు తెలియనుకూడా తెలియదు – నువ్వొక్కర్తివే ఈ దుఃఖాన్ని భరించవలసి వచ్చింది – నీ జన్మం ఎంత దౌర్భాగ్యపు జన్మం...”

చంద్రమతి లోపల్లోపల కుళ్ళికుళ్ళి ఏడుస్తూ చితిని పేర్చుకొంటుంటే, కావలికాస్తున్న హరిశ్చంద్రుడు వచ్చి ఆమెను ఆపుతాడు.

ఆమె మాటతీరునిబట్టి, ఆమె సౌశీల్యవతి అనీ, కారణాంతరాలవలన కష్టదశను పొందిందనీ, ఈమె గొంతు బాగా విన్నట్లున్నదని అనుకొంటాడు. ఆమె తన భార్యేనని గుర్తించలేని స్థితి.



“అమ్మా! ఎవరు నువ్వు... రాళ్ళు కరిగేలా ఏడుస్తున్నావు ? నీ కొడుకు ఎలా చచ్చిపోయాడు? నీకు చుట్టాలంటూ ఎవరూ లేరా ...? ఈ నడిరాత్రి ఒంటరిగా స్మశానానికి ఎట్లా వచ్చావు? నిన్ను చూస్తుంటే అంతా విచిత్రంగా వుంది –” అని పరామర్శించాడు జాలిగా హరిశ్చంద్రుడు చంద్రమతిని. ఆ కటిక చీకట్లో భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు పోల్చుకునే స్థితిలో లేరు.

ఈ మహాత్ముడెవరోగాని, కాటికాపరిలా లేడు. ఈయన మాట్లాడుతోంటే మనసుకు కొంచెం శాంతి కలుగుతోంది –

“అయ్యా ! తమరెవరో తెలియదు – శ్మశానంలో తిరిగే భూతనాథుడు ఆ పరమశివుడే మీరనుకొంటాను – కరుణతో నన్ననుగ్రహించడానికి వచ్చిన సిద్ధమూర్తివనుకొంటాను... పరమదయాబ్ధీ... ఈ భూమ్మీద ఎందుకూ కొరగాని ఒక అభాగ్య దేవతని ! కాశీపురంలో ఒక బ్రాహ్మణుడి ఇంటి దాసీదాన్ని – నా పేరు హంసనారి’ ’ అని చెప్పుకొంది చంద్రమతి. తను కేవలం కాటికాపరి వీరదాసుణ్ణన్నాడు హరిశ్చంద్రుడు. ఇద్దరూ తమ అసలుపేర్లు చెప్పుకోలేదు.

ఎందుకో ఆమె మాటలు వింటుంటే, ఆ చనిపోయిన కుర్రవాడు తన పుత్రుడు లోహితాస్యుడేమో...నన్పించింది... అంతలోనే సర్దుకొని, “లోహితా! నీకు అమంగళం ప్రతిహతమగుగాక” అనుకొన్నాడు. అంతలోనే అతని విధి నిర్వహణ గుర్తుకొచ్చింది. కఠినంగా మారిపోయాడు. ఈ విధంగా కాటికాపరిగా జీవించే ఈ చండాలదాసుడికి కరుణ ఎక్కడిదీ...? శవదహనానికి కాపరి ఆజ్ఞ కావాలనేసరికి ఆశ్చర్యపోయింది చంద్రమతి.

“ఇది కాటి చట్టం! ఎవ్వరైనా సరే దహింపవలసిన శవాన్ని తెచ్చి మాకు చూపించాలి. చెల్లించవలసిన సుంకం చెల్లించాలి. అప్పుడే దహనకార్యం...” అని తెగేసి చెప్పాడు. సుంకం చెల్లించకపోతే శవాన్ని పారేస్తాను... అంటూ పిల్లవాణ్ణి పైకెత్తాడు... ఆ స్పర్శ... తన పుత్రుడిదే అనిపిస్తోంది... ఆ ఊహని తట్టుకోలేకపోతున్నాడు – కుమారా... నీకు దీర్ఘారోగ్యాలు కలుగుగాక... అనుకున్నాడు మనసులోనే !

“అయ్యా! నా శరీరం తప్ప నా దగ్గర ఇవ్వడానికేమీ లేదు – కనికరించు–” అని వేడుకొంది చంద్రమతి.

“ఏమీ... ఇంకేమీ లేదా ? బాలసూర్య ప్రభాకవితంబై వెలుగొందుతున్న మాంగల్యం కాబోలు నీ పయ్యెదమీద స్పష్టంగా కన్పిస్తోంది – దాన్ని ఏ ధరకైనా తెగనమ్మి సుపుత్రుడి దహన క్రియ చేసుకోమన్నాడు నిర్దయగా హరిశ్చంద్రుడు.

ఆ మాటలకు ఉలిక్కిపడింది చంద్రమతి. రెండవ దేవేంద్రుడని ప్రఖ్యాతిపొందిన వశిష్ఠ మహర్షి ప్రభావంతో నా భర్తకు తప్ప ఇతరులకు కన్పించని మంగళసూత్రం ఈరోజు చండాలుడైన ఒక కాటికాపరికి కన్పించిందంటే... ఈయన ఎవరో కాదు... తన పతి హరిశ్చంద్రుడే అని గుర్తించింది చంద్రమతి... హా ! నేనే మందభాగ్యురాలిని... నీ జీవితేశ్వరి చంద్రమతిని... అల్లారుముద్దుగా పెంచిన నీ వంశాంకురం లోహితాస్యుడు గులకరాళ్ళగుట్టమీద శవమై పడున్నాడు...” అని గుండెలు బాదుకొంటూ రోదిస్తూ వివరించింది చంద్రమతి.

“నాథా! నీ రాజసం ఎక్కడికి పోయింది... నీ తేజం ఎక్కడ దాగింది... జీవితేశ్వరా ! నీ పాదాక్రాంతులై నీకు నమస్కరించే సామంతులంతా ఏమయ్యారు – రాజ్యం పోగానే వాళ్ళంతా ముఖం చాటేశారు దేనికి ?

నాకు దొరికిన దాస్యం కంటే మీకు దొరికిన దాస్యం వెయ్యిరెట్లు నీచం ! ఈ చండాల సేవావృత్తిలో ఇలా మీరుంటారని, కొడుకు శవాన్ని తీసుకొని నేనే ఇలా మీదగ్గరకొస్తానని కల్లో కూడా ఊహించలేదు – నృపసార్వభౌమా ! ధైర్యం తెచ్చుకోండి – దయచేసి ఒక్కమాటయినా మాట్లాడండీ !! అంటూ దుఃఖసముద్రంలో కూరుకుపోయింది చంద్రమతి.

హరిశ్చంద్రుడు నిశ్చలస్థితిలో మౌనముద్రలో వుండిపోయాడు –

ఇంక తక్షణ కర్తవ్యం...? తనుకూడా బానిసగానే వున్నాడు కదా... ఏం చెయ్యగలడు–

"మీ దొరసానినడిగి మా స్వామికి కట్టవలసిన 'మాడ' సుంకాన్ని ఎలాగైనా సంపాదించుకొనిరా. ఇప్పుడు నేను చెయ్యగలిగిన సహాయం నాకు ఇందులో రావలసిన పిండాశనం వదులుకోవడం తప్ప వేరే ఏమీ లేదు–" అన్నాడు హరిశ్చంద్రుడు.

తన దొరసానికి కాసింత దయ కూడా కల్గకపోతే, విధి ఎట్లా విధిస్తే అట్లా జరుగుతుంది – అనుకొంటూ బయల్దేరింది చంద్రమతి... కాటిసుంకం ఇప్పించవలసిందిగా యజమానురాలు కాలకంటకిని బతిమాలుకోవాలని !

H H H

తెల్లవారవస్తోంది. రాత్రి మూడోఝామున వెళ్ళిన చంద్రమతి ఇంకా తిరిగిరాలేదు – కాటిపన్ను తేలేదు –

అంతలో ఏదో కలకలం విన్పిస్తోంది –

రాజభటులు ఒక స్త్రీని పట్టుకొని శ్మశానానికి తీసుకొస్తున్నారు... ఎవరామె... వాళ్ళు సమీపిస్తున్నకొద్దీ అతని గుండెదడ పెరగసాగింది... ఎవరు... ఎవరు...

"నా కళ్ళకు భ్రమ కల్గిందా... నిజంగానే నేను చూస్తున్నది చంద్రమతినేనా..." నిర్ఘాంతపోయాడు హరిశ్చంద్రుడు.



"ఓయీ! వీరదాసా! రాజుగారింట్లో దొంగతనంచేసి, ధనాశతో రాజుబిడ్డను చంపిన ఈ బాలహంతకి తల నరికించమని రాజాజ్ఞ ! ఈమె తలకోయవలసిందిగా మీ వీరబాహుడు నీకు ఉత్తరం ఇచ్చాడు – ఇదిగో ఆయన ఆనవాలు... దాని తల నరికెయ్ –" అని హూంకరించాడు భటుడు –

"చంద్రమతీ...జగదేక పావనివైన నీమీదే నీచుడు నిందారోపణ చేస్తున్నాడా...'
' అన్నాడు హరిశ్చంద్రుడు.

"నాథా! వినండి – మీరుచెప్పినట్లు దొరసాని దగ్గర డబ్బులడగటానికి చీకట్లో వెడ్తుంటే దారిలో ఒక బాలశవం నా కాళ్ళకు తగిలింది. నేను మతిచలించినట్లు ఆ శవం మన లోహితుడిదేమోనని పరీక్షగా చూస్తుంటే, యమకింకరుల్లా ఈ రాజభటులు వచ్చి "ఓసీ! పాపాత్మురాలా ! రాచబిడ్డనే చంపావా?" అని నగలమూటని నా ఒళ్ళో పడేసి, దొంగ చిక్కిందని తన్నుకొంటూ రాజుగారి దగ్గరకు తీసుకుపోయారు. ఆయన ఏ విచారణ చెయ్యకుండా నా తల నరికేయమని ఆజ్ఞాపించాడు – అని వివరించింది –

"మీరింక నిష్కళంక చిత్తంతో మీ సత్యవాణిని దేవతలంతా ప్రశంసించే విధంగా నా తల నరికి, మీ స్వామి ఆజ్ఞ నెరవేర్చండి – ప్రాణపతి ! నా కడసారి వందనం అందుకోండి–
" అంటూ ఆయన పాదాలమీద పడి భోరున ఏడ్చింది చంద్రమతి.

గుండె రాయి చేసుకొన్నాడు హరిశ్చంద్రుడు.

"మానినీమణి ! గతం అంతా మరచిపో...! ఏకాగ్రత కుదుర్చుకో... మనసారా భక్తితో ఆ భగవంతుణ్ణి తలచుకొంటూ కళ్ళుమూసుకో" అన్నాడు హరిశ్చంద్రుడు. కాటికాపరిగా తన విధిని తాను నిర్వర్తించడం ఒక్కటే ఇప్పుడాయన చెయ్యగలిగింది. తను బానిస ! బానిసలకు మంచీ చెడులు తర్కించే అవకాశం ఎక్కడుందీ ...?

ఏ క్షణాన ఆయన ఎదురు తిరిగినా అసత్యదోషానికి పాల్పడినట్లే... అందుకై కష్టాలను భరించడానికే సిద్ధమయ్యాడు. విధి ఆడించినట్టల్లా ఆడ్తున్నాడు.

ఈ నాటకానికి చివరి అంకం నా భార్యని నేనే వధించడం కాబోతోందా...?

అయ్యో ! నేనెంత ఘోర పాతకుణ్ణి –

పాలవంటి కులంలో వ్యాకులాన్ని తెచ్చి, ఒక అంటరానివాడి దగ్గర బానిసగా బతకడానికి అంగీకరించింది చాలక, శరణాగతులైన వాళ్ళని, ఆడవారిని వధించననే నా ప్రతిజ్ఞని నేనే భంగం చేసుకోవాల్సి వస్తోంది –

చేపట్టిన కులకాంతను చేజేతులా తలనరికే సాహసం చేస్తున్నాను –

ఈ వీరబాహుడు రాజాజ్ఞ తానే నిర్వహిస్తే ఎంత బావుండేది ... ఈ పనికూడా నాచేతే చేయించాలనుకోవడం... ఎంత దురవస్థ !

ఇన్ని దుఃఖాలతో నన్నింతకాలం బతకనిచ్చింది ఈ స్త్రీ హత్యాపాతకం ఒడిగట్టడానికా? కటకటా...!! భగవంతుడా... నీకు దయలేదా ...

పవిత్రమైన సత్యవ్రత రక్షణార్థం నేను ఎంత సాహసాన్నయినా చేయవలసిందే...



"సత్యం కోసం ఈ హరిశ్చంద్రుడి వంశం అంతరించిపోతే అంతరించిపోనీ... శ్రీహరుడి మీద మనసుపెట్టుకొంటాను... చంద్రమతి... నీ కంఠాన్ని ఈ వధ్యశిలపైన వుంచు – ఖడ్గానికి సిద్ధంగా వుండు –" అంటూ పరమ కర్కశంగా కత్తి ఎత్తి ఒకే ఒక వేటు వేసేంతలో...

విశ్వామిత్రుడు పరుగు పరుగున వచ్చాడు –

"భళిరే ! భళిరే ! హరిశ్చంద్రా... చాలు చాలు... నీ సాహసం ఆపు... నువ్వెక్కడి మనిషివయ్యా... రాక్షసుడికి పుట్టావా ఏమిటీ...

శత్రుసంహారం చేయవలసిన నీ రాజసం ఇప్పుడు ఈ సుకుమారిని చంపడానికి ఉపయోగపడిందా ?

మూడు నెలలు సాముచేసి మూలనున్న ముసలమ్మని పొడిచినట్లు నీ భుజబలం ఇలా కుసుమకోమలుల్ని చంపడానికి పనికొచ్చిందా...

నీ కులగురువు వశిష్ఠుడు నీకు ధనుర్వేదం నేర్పింది ఇందుకేనా ?

జగద్వంద్యమైన మహాసూర్యవంశంలో పుట్టి మావంటి వాళ్ళకు తలవంపులు తెచ్చేలాగా ఒక అంటరాని వాడి దగ్గర దాస్యానికి చేరింది చాలక స్త్రీ హత్య చేయడానికి కూడా సిద్ధపడ్తున్నావా... దుర్మార్గుడా ! సాధ్వీమతల్లి ఈ నీ ఇల్లాలిని చంపి స్వర్గరాజ్యం ఏలాలని అనుకొంటున్నావా ? ఇప్పటికైనా నా మాట విను... నా ముద్దుల పెంపుడు కూతుళ్ళని పెళ్ళాడు – నీ భార్యాపుత్రులకి ప్రాణదానం చేస్తాను – నీ రాజ్యం నీకిచ్చేస్తాను –" అంటూ చివరి ప్రయత్నం చేశాడు ఆశగా విశ్వామిత్రుడు.

అప్పటికీ లొంగలేదు హరిశ్చంద్రుడు. "విశ్వామిత్రా! నీ నీతులు నాకవసరం లేదు – మీ అప్పు తీర్చేశాను – మీతో నాకు ఏ సంబంధం లేదు – ఇక్కణ్ణుంచి తక్షణం

వెళ్ళిపోండి – నా మనసు మార్చడం మీ తరం కాదు – అవతలికిపోండి –” అని కసిరికొట్టాడు –

మళ్ళీ కత్తి ఎత్తి తన విధి నిర్వహణలోకి వెళ్ళిపోయాడు.



అప్పటికి జ్ఞానోదయం అయ్యింది విశ్వామిత్రుడికి ! “హరిశ్చంద్రా! ఈ పాటికి శాంతించు... నీ గురువే జయించాడు. నేనే ఓడాను–” అన్నాడు.

హరిశ్చంద్రుడికీ మాటలు అయోమయాన్ని కల్గించాయి. “మీ మాటలు నాకర్థం కావడం లేదు – గురువేంటో జయం ఏంటో నాకేమీ తెలీదు – దయచేసి వెళ్ళిపోండి – ” అన్నాడు.

హరిశ్చంద్రుడు ఈ స్త్రీ హత్య చెయ్యకుండా ఆయన్ని ఆపడం ఎలాగో అర్థం కాలేదు విశ్వామిత్రుడికి ! “ఏం చెయ్యాల్రా బాబూ...” అనుకొంటూ దేవేంద్రా... నువ్వయినా ఈ హరిశ్చంద్రుని వారించవయ్యా... హరిశ్చంద్రా... శాంతించవయ్యా... అంటూ లబోదిబోమన్నాడు విశ్వామిత్రుడు.

సరిగ్గా ఈ సమయానికి వశిష్ఠుడు ఇక్కడికి రావాలి కదా... వశిష్ఠా... రావయ్యా... ఇప్పుడు పెళ్ళివారి నడక సాగిస్తావేమయ్యా... మహేంద్రా... హరిశ్చంద్రుడు ఇప్పటికే తెగించి చంద్రమతిని చంపడానికి సిద్ధం అవుతున్నాడు... ఎలాగైనా ఇతన్ని ఆపు.

ఓ కాశీవిశ్వనాథా ! నువ్వైనా ఈయన్ని వారించు –” అంటూ భోరుమన్నాడు విశ్వామిత్రుడు.

హరిశ్చంద్రుడు చంద్రమతిని చంపితే, ఆ స్త్రీహత్యాపాతకం ఆయనతోపాటు తనకీ చుట్టుకొంటుంది – అందుకే అంతఖంగారు పడిపోయాడు. “హరిశ్చంద్రా ! నేనే ఓడిపోయాను – సరేనా...” అన్నాడు.

విశ్వామిత్రుడు పూర్తిగా ఓడిపోయినట్లు అంగీకరించిన తర్వాత పార్వతి సహితుడై పరమేశ్వరుడు, ఇంద్రుడు, వశిష్ఠుడు... అందరూ ప్రత్యక్షమయ్యారు.

అందరికీ అభివాదం చేశాడు హరిశ్చంద్రుడు.

"వత్సా ! హరిశ్చంద్రా ! నీపట్ల పరమేశ్వరుడు ప్రసన్నుడయ్యాడు – నీకింక కష్టాలు తొలగినట్లే –" అన్నాడు వశిష్ఠుడు.

పార్వతీదేవి చంద్రమతిని దగ్గరకు తీసుకొని, "పతివ్రతా తిలకమా! నీవలన లోకం అంతా పవిత్రమైంది. నీకే వరాలు కావాలో కోరుకో" – అన్నది.

"అమ్మా ! మీరు ప్రసన్నురాలయ్యాక ఇయ్యలేనిది ఏముంది... చచ్చిపోయిన ఆ రాజుగారి బిడ్డను బతికించు... నామీద హత్యానేరం రూపుమాసిపోతుంది" అని వేడుకొంది చంద్రమతి.

"సాధ్వీమణి ! నీ ధర్మానికి మెచ్చాను – ఆ రాచబిడ్డతోపాటు నీ కుమారుడు కూడా సజీవుడు అయ్యేలాగా అనుగ్రహిస్తున్నాను –" అని దీవించింది పార్వతి.

లోహితాస్యుడు నిద్రలేచినట్లు లేచి, "మిత్రులారా! నేను కోసిన దర్భలేవీ–" అని వెదుక్కోసాగాడు.

పరమేశ్వరుడు నవ్వి "కుర్రా! నీ దర్భలు నీ గురువులకు చేరాయి. ఖంగారుపడకు–" అని, హరిశ్చంద్రుడితో "నువ్వింక రాజధానికి పోయి రాజ్యాభిషేకం చేసుకో–" అన్నాడు.

"అంటరానివాడికే దాసుణ్ణయిన నాకు ఇంక రాజ్యం ఏమిటీ... మీ దర్శనభాగ్యం దొరికింది, అంతే చాలు..." అని నమస్కరించాడు.

అప్పుడు విశ్వామిత్రుడు కల్పించుకొని... "నీ సత్యవ్రతాన్ని పరీక్షించడంకోసం ఈ కష్టాలన్నీ నీకు నేను తెచ్చిపెట్టినవే... ఇదంతా నా మాయాకల్పితాలే... చూడు...

ఈ శ్మశాన యజమాని వీరబాహుడు పరమయముడే కానీ, కడజాతివాడు కాదు – ఈ భూమి ఉద్యానవనమేకాని, శ్మశానం కాదు – పనికత్తెగా నీ భార్యని కొన్నవాడు బాలచంద్ర కోటీరుడు (చంద్రుడు) గానీ ఎవరో విప్రుడు కాదు.

కాబట్టి, నీ రాజ్యాన్ని నువ్వు గ్రహించి నన్ను చరితార్థుణ్ణి చెయ్యి –" అని తాను పూర్తిగా ఓడిపోయినట్లు అంగీకరించి రాజ్యాన్ని హరిశ్చంద్రుడికిచ్చేసినట్లు ప్రకటించాడు.

వశిష్ఠుడు కూడా హరిశ్చంద్రుణ్ణి రాజ్యం స్వీకరించడానికి అంగీకరించవలసిందిగా సూచించాడు.

"విశ్వామిత్రా! నీ చేతిలో కిరీటం ఆయన తలమీద అలంకరించు –" అని ఆజ్ఞాపించాడు పరమశివుడు.

అప్పుడు దేవేంద్రుడు, "ఆరోజున దేవసభలో నువ్వు ప్రతిజ్ఞ చేసినట్లు, నిత్య సత్యవ్రతుడైన ఈ హరిశ్చంద్ర చక్రవర్తిని నీ చేతుల్తో పట్టాభిషిక్తుణ్ణి చేసి, నీ తపశ్శక్తినంతా ఆయనకి ధారపోయి" అని సూచించాడు విశ్వామిత్రుడికి !

అప్పుడు గర్వంగా చూశాడు వశిష్ఠుడు. "విశ్వామిత్రా ! ఇప్పటికైనా ఎవరు గెలిచారో చెప్పు" అన్నాడు.

ఓటమిని అంగీకరించడం విశ్వామిత్రుడి జన్మలో లేదు కదా... ఆయన పెద్దగా నవ్వి – "చాలు ! చాలు ! వశిష్ఠా నేను ఓడానని పొంగిపోకు – హరిశ్చంద్రుడు రాచబిడ్డ ! సాటి రాచబిడ్డ సత్యయశస్సుని ప్రకటించడానికి నేను ఈ పందానికి ఒప్పుకున్నాను గాని, నాకు పరాజయం ఎక్కడిది... ఇన్ని కష్టాలు పెట్టకపోతే ఆయన సత్యకీర్తి లోకానికి వెల్లడి అయ్యేదా ?" అన్నాడు సమర్థించుకొంటూ !

హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడితో ఏకీభవించాడు. "కరిగితే గాని బంగారానికి కాంతి రాదు. చిలికితే గాని పాలలోంచి వెన్న బైటకు రాదు. సానపెడితేగాని వజ్రాలకు వెలుగు రాదు. ఇడుములు పడకపోతే కీర్తి ఏర్పడదు–" అన్నాడు.



పరమేశ్వరుడు హరిశ్చంద్రుడి మాటలకు సంతోషించాడు. ఇంత జరిగినా విశ్వామిత్రుడిమీద ఆయనకు కోపం కలగకపోవడంతో పరమేశ్వరుడికి ముచ్చట వేసింది. "ఇంకేం కావాలో కోరుకో–" అన్నాడు. దేవా! నేనింక కోరదగినదేముందీ – పంటలు విశేషంగా పండి, అధికారులు కరుణతో ప్రజల్ని పాలిస్తూ, అసత్యం అనేది నశించిపోయి సత్యమే జయాన్ని పొంది, ధీలలితులైన కవిధీరుల కోర్కెలు నెరవేరేలాగా ఈ ప్రపంచానికి వరం ఇమ్మని అడిగాడు హరిశ్చంద్రుడు. అదీ, సత్యవాక్పాలన కోసం అంకితమైన హరిశ్చంద్రుడి కథ !

★ ✪ ★